నమస్తే హైదరాబాద్

మీ గళం.. మా కలం...!

NAMASTHE HYDERABAD

తెలుగు దిన పత్రిక

RNI No: APTEL/2012/45237

రంగారెడ్డి Rangareddy	శుక్రవారం 30-10-2026 FRIDAY 30-10-2026	సంపుటి: 15 Volume: 15	సంచిక: 140 Issue : 140	పేజీలు : 8 Page's: 8	వెల: 3/- Rs: 3/-

అన్నీ కోల్పోయినా ఆత్మ విశ్వాసాన్ని కోల్పోకూడదు, అదొక్కటి చాలు కోల్పోయిన వాటిని తిరిగి తెచ్చుకోవడానికి

- మక్సిం గోర్కీ

తెలంగాణ అభివృద్ధికి
కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోంది

- తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.
- ఢిల్లీలో జరిగిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సన్నాహక సదస్సులో పాల్గొన్నారు.
- రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరిస్తోంది
- ఆర్ఆర్ఆర్ తెలంగాణ గేమ్ ఛేంజర్

హైదరాబాద్ : (నమస్తే హైదరాబాద్): కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ లక్ష్యాల దిశగానే తెలంగాణ సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని కేంద్రం నిర్దేశించుకుందని, 30 ట్రిలియన్ డాలర్లలో 10 శాతాన్ని తెలంగాణ కంట్రిబ్యూట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఢిల్లీలో తాజ్ ప్యాలెస్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సన్నాహక సదస్సుకు సీఎం రేవంత్ రెడ్డి హాజరై పెట్టుబడిదారులను ఉద్దేశించి కీలక ఉపన్యాసం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అభివృద్ధి విషయంలో

మిగతా 2లో...

ఎస్సీ, ఎస్టీల సమగ్ర అభివృద్ధికి
ప్రత్యేక కార్యాచరణ

హైదరాబాద్, (నమస్తే హైదరాబాద్): ఎస్సీ, ఎస్టీల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వినియోగంపై

మిగతా 2లో...

కులం, మతం, డబ్బుతో దేశాన్ని
విభజించాలని చూస్తున్నారు

ఢిల్లీ (నమస్తే హైదరాబాద్): కులం, మతం, డబ్బుతో కొన్ని శక్తులు దేశాన్ని విభజించాలని చూస్తున్నాయని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. అలాంటి శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత సానుకూల ఆలోచనలతో ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దేశ చట్టాలు, నిబంధనలను పాటిస్తూ తమ బాధ్యతలను నిర్వర్తిస్తే దేశం బలోపేతమవుతుందని హితవు పలికారు. దేశ ప్రజలందరూ వికసిత్ భారత్ కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మిగతా 2లో...

పోలీసుల లాఠీలకు
భయపడొద్దు

■ నవంబర్1న ర్యాలీకి తరలిరండి: ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపు

ఢిల్లీ (నమస్తే హైదరాబాద్): నవంబర్ 1న ఇండీ కూటమి తలపెట్టిన చలో ఢిల్లీ ర్యాలీలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. పోలీసులు, లాఠీలకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. తమ కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బీజేపీకి లేదన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవటానికి, దేశాన్ని కాపాడుకోవడానికి కలిసికట్టుగా నడుద్దామని రాహుల్ గాంధీ అన్నారు. ముఖ్యంగా

మిగతా 2లో...

బ్యాలెట్ ద్వారా బీజేపీకి
బుల్లెట్ దింపాం

హైదరాబాద్ (నమస్తే హైదరాబాద్): "ఎన్ని గెలిచామన్నది కాదు, ఎక్కడ గెలిచామన్నది ముఖ్యం. బీజేపీ అబ్బ అయిన ఆర్ఎస్ఎస్ హెడ్‌క్వార్టర్స్‌లోనే బీజేపీని ఓడించి, బ్యాలెట్ ద్వారా బుల్లెట్ దింపాం" అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్

మిగతా 2లో...

నేను అప్పుడు అలా
మాట్లాడాల్సింది కాదు

- కేటీఆర్‌కు సారీ చెప్పిన కొండా సురేఖ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు క్షమాపణ చెప్పిన కొండా సురేఖ
- గతంలో చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటన
- రేవంత్ రెడ్డి క్యాబినెట్ నుంచి తొలగించిన తర్వాత ఈ పరిణామం

హైదరాబాద్: (నమస్తే హైదరాబాద్): తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకురాలు కొండా సురేఖ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు క్షమాపణ చెప్పారు. గతంలో ఆయనపై చేసిన వ్యక్తిగత, నిరాధారమైన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఈ పరిణామంతో ఆమె తిరిగి బీఆర్ఎస్‌లో చేరతారనే ఊహాగానాలు జోరందుకున్నాయి.

మిగతా 2లో...

102 ఉద్యోగాలకు టీజీపీఎస్సీ నుంచి
కొత్త నోటిఫికేషన్

మిగతా 2లో...

హైదరాబాద్ (నమస్తే హైదరాబాద్): తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఆర్థిక, గణాంక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 102 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది. వీటిలో మండల ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఎంపీఎస్ఓ), డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్‌లో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్ఓ) పోస్టులు ఉన్నాయి. అక్టోబర్ 30 నుంచి ఈ పోస్టులకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుండగా, నవంబర్ 27 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన అర్హతలు, వయో పరిమితి, ఫీజు వివరాలను

మిగతా 2లో...

పబ్లిక్ గొంతు నొక్కడం ఏ రకమైన
పబ్లిక్ హియరింగ్ అవుతుంది

హైదరాబాద్ (నమస్తే హైదరాబాద్): తెల్లారి లేస్తే రాజ్యాంగాన్ని పట్టుకొని పోజులు కొట్టే రాహుల్ గాంధీ మీకాంగ్రెస్ పాలితరాష్ట్రంలోఏంజరుగుతుందో మీకు సోయి లేదా.. పబ్లిక్ హియరింగ్ అని చెప్పి.. పబ్లిక్ గొంతు నొక్కడం ఏ రకమైన పబ్లిక్ హియరింగ్ అవుతుందని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కరువులో రాష్ట్రం ఉంటే సుందరీకరణ పేరుతో డ్రామాలు మీరే చెప్తున్నారు.. కరువు నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి ఊళ్లల్లో నాటకాలు వేయాలంట.. జానపదాలు పాడాలంట.. పద్యాలు పాడాలట.. డ్రామాలు చేయాలట. ఇక్కడ మాత్రం మూసీలో లక్షన్నర కోట్ల లూటీకి ముఖ్యమంత్రి తెరలేపారని అన్నారు. ఆయనకు రియల్ ఎస్టేట్ తప్ప ఏం తెలియదని ముఖ్యమంత్రి స్వయంగా చెప్పారు.. రియల్ ఎస్టేట్ అంటేనే రేవంత్ రెడ్డి.. రేవంత్ రెడ్డి అంటేనే రియల్ ఎస్టేట్ అని అంటరు.. అని అంటరని కేటీఆర్ గుర్తు చేశారు.

మిగతా 2లో...

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు
ఏరియల్ వ్యూ

అమరావతి, (నమస్తే హైదరాబాద్): ఆర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు (గురువారం) ఏరియల్ వ్యూ ద్వారా ఆయా ప్రాంతాల్లోని పంటలను పరిశీలిస్తున్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో సీఎం పరిశీలించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. అమరావతి నుంచి కాట్రేనికోన మండలం చెయ్యేరుకు చేరుకున్నారు.మార్గం మధ్యలో ఏరియల్ వ్యూ ద్వారా ఆర్నబ్ తుఫాన్ వల్ల నష్టపోయిన వరిచేలు, అరటి, కొబ్బరి తోటలు, ఆక్వా చెరువులను ముఖ్యమంత్రి పరిశీలించి, రైతులకు భరోసా కల్పించారు. ఏరియల్ వ్యూ ద్వారా కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ ప్రాంతాల్లో తుఫాన్ ప్రభావాన్ని పరిశీలించారు. నిమ్మకూరు, పామర్రు,

మిగతా 2లో...

బియ్యం బ్లాక్ మార్కెట్ చేస్తే
కఠిన చర్యలు

ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తాం

హైదరాబాద్, (నమస్తే హైదరాబాద్): బియ్యం బ్లాక్ మార్కెట్ చేసేవారికి సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బియ్యం స్మగ్లింగ్ చేసేవారిపై బైండోవర్ కేసులు బుక్ చేస్తున్నామని తెలిపారు. ఎల్‌నినో నేపథ్యంలో బియ్యం ధరలు పెరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బియ్యం అక్రమ అమ్మకాలపై సమాచారంతో రైడ్స్ నిర్వహిస్తున్నామన్నారు. విజిలెన్స్ అధికా రులతో కలిసి హైదరాబాద్‌తో పాటు వివిధ చోట్ల తనిఖీలు

మిగతా 2లో...

మల్లన్నసాగర్‌కు అతీ
సమీపంలో బ్లాస్టింగ్‌లు

సిద్దిపేట (నమస్తే హైదరాబాద్): హైదరాబాద్ మూసీ నది సుందరీకరణకు నీటి తరలింపు కోసం చేపడుతున్న నిర్మాణ పనుల వద్ద బండరాళ్ల బ్లాస్టింగ్ ల వల్ల మల్లన్నసాగర్ రిజర్వాయర్ ప్రమాదంలో పడుతుందని డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీష్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మల్లన్నసాగర్‌ను బీఆర్ఎస్ నాయకుల తో కలిసి పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడుతున్నారని ఆరోపించారు. గత రెండు నెలలుగా

మిగతా 2లో...

నమస్తే హైదరాబాద్
మీ గళం.. మా కలం...!
NAMASTHE HYDERABAD
తెలుగు దిన పత్రిక
RNI No: APTEL/2012/45237

సంపాదకీయం

పత్రికా స్వేచ్ఛపై గొడ్డలిపెట్టు

పత్రికా స్వేచ్ఛకు, పరిశోధనాత్మక జర్నలిజానికి తీవ్ర ముప్పు వాటిల్లే డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డిపిడిపి యాక్ట్)ను ప్రభుత్వం తీసుకు వచ్చింది. దీనిపై దేశవ్యాప్తంగా మీడియా సంస్థలు, ఎడిటర్స్ గిల్డ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కొత్త చట్టం లోని కొన్ని నిబంధనలువల్ల వార్తా సంస్థల న్యూస్‌రూమ్‌ల కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని సుప్రీం కోర్టుకు మంగళవారం విన్నవించాయి. దీంతో సుప్రీంకోర్టు తక్షణం స్పందించి ప్రతివాదులకు నవంబర్ 17లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. ఈ కొత్త చట్టం ప్రకారం ఎవరైనా అవినీతిపరులు, అక్రమార్కులని అనుమానం వస్తే వారి వ్యక్తిగత వివరాలు సేకరించి పరిశోధించడానికి ముందుగా వారి అనుమతి తప్పనిసరి. బ్రిటన్, ఐరోపా వంటి ప్రజాస్వామ్య దేశాల్లోనైతే ఈ విషయంలో జర్నలిస్టులకు పూర్తి స్వేచ్ఛ కల్పిస్తున్నారు. అలాగే ఈ కొత్త చట్టంద్వారా సమాచార హక్కు చట్టాన్ని బలహీనం చేశారు. చట్టం లోని సెక్షన్ 44(3) ద్వారా 2005 నాటి సమాచార హక్కు చట్టాన్ని సవరించారు. దీని ప్రకారం ప్రజా ప్రయోజనాలతో సంబంధం లేకుండా ఏ ప్రభుత్వ అధికారికి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని 'ఆర్‌టిఐ' ద్వారా ఇవ్వడానికి వీల్లేదు. ఇంతేకాదు సమాచార వనరుల గోప్యతకు కూడా ఈ చట్టం భంగం కలిగిస్తుంది. జర్నలిస్టులకు రహస్యంగా వాస్తవాలు చెప్పే వ్యక్తుల వివరాలను అందించాలని ప్రభుత్వం కోరితే ఆ సమాచారాన్ని మీడియా సంస్థలు అందించవలసి ఉంటుంది. చట్టం లోని సెక్షన్ 36 ప్రకారం డేటాను సేకరించే విస్తృత అధికారం ప్రభుత్వానికి సంక్రమించింది. ఈ నిబంధనలను ఉల్లంఘించి ఎవరిదైనా వ్యక్తిగత డేటాను అనుమతి లేకుండా ప్రచురిస్తే లేదా చట్టాన్ని పాటించకపోతే ఆయా మీడియా సంస్థలపై లేదా స్వతంత్ర జర్నలిస్టులపై రూ. 200కోట్ల నుండి రూ. 250 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అలాగే ఈ చట్టం కింద పౌరులకు తమ డేటాను తొలగించమని కోరే హక్కు ఉంటుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి ఏదైనా నేరం పై కేసు నమోదై కోర్టులో విచారణను ఎదుర్కొంటున్నప్పుడు, మీడియా ఆ వార్తను డిజిటల్‌గా పబ్లిష్ చేస్తే సంబంధిత నిందితుడు తన అనుమతి లేకుండా తన పేరు, ఫోటో వాడారని, ఆ వార్తను ఇంటర్నెట్ తొలగించాలని డిమాండ్ చేయవచ్చు. ఈ పరిస్థితి వల్ల ప్రజా ప్రయోజనార్థం రాసిన నిజమైన వార్తలు కూడా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లనుంచి మాయమైపోయే ప్రమాదం ఉంటుంది. ఈ కఠినమైన నిబంధనల దృష్ట్యా జర్నలిస్టులు స్వేచ్ఛగా తమ విధులను నిర్వహించడానికి, వార్తా మూలాల గోప్యతను కాపాడడానికి ప్రత్యేక మినహాయింపులు అవసరమని డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ వాదిస్తోంది. 2018 నుండి 2021 వరకు ప్రతిపాదించిన చట్టం మునుపటి ముసాయిదాల్లో జర్నలిస్టులకు తమ వృత్తిపరమైన బాధ్యతల నిమిత్తం ప్రత్యేక మినహాయింపులు ఉండేవని, అయితే 2022 ముసాయిదాలో, 2023లో రూపొందించిన చట్టంలో ఈ మినహాయింపు తొలగించారని డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. దేశ చరిత్రలో బ్రిటిష్ పాలన లోనూ, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కాలం లోనూ పత్రికా స్వేచ్ఛను అణగదొక్కే సంఘటనలు ఎన్నో జరిగాయి. ఇప్పటికీ జరుగుతున్నాయి. మీడియాపై ఆంక్షలు విధించడం, చట్టాలను దుర్వినియోగం చేయడం, జర్నలిస్టులను వేధించడం వంటి సంఘటనలు జరిగాయి. 1951లో శాంతిభద్రతల పేరుతో పత్రికా స్వేచ్ఛపై కొన్ని పరిమితులు విధించారు. 19751977 లో ఎమర్జెన్సీ, 1988లో పరువునష్టం బిల్లు, 20092014లో ఇంటర్నెట్, సోషల్ మీడియా వేదికలపై నియంత్రణ, తదితర చర్యలు గతంలో ఉదాహరణగా నిలిచాయి. రాష్ట్రాల్లోని ప్రాంతీయ ప్రభుత్వాలు కూడా తమకు నచ్చని మీడియా సంస్థలపై అప్రకటిత నిషేధాజ్ఞలు విధించడం, కొందరి జర్నలిస్టులపై పోలీసులు తప్పుడు కేసులు బనాయించడం జరుగుతున్నాయి. 2003లో తమిళనాడులో ఒక ప్రముఖ ఆంగ్ల పత్రికలో వచ్చిన విమర్శనాత్మక వార్తా కథనాల కారణంగా ఆ పత్రికకు సంబంధించిన పాత్రికేయులు, ఉన్నతాధికారులకు అప్పటి రాష్ట్ర శాసనసభ జైలు శిక్ష విధించడం సంచలనం కలిగించింది. అయితే 2004 జులైలో ఆ తీర్మానాన్ని వెనక్కు తీసుకున్నారు. 2026 అక్టోబరులో సుప్రీం కోర్టు ఈ కేసుకు సంబంధించిన విచారణలను నిరర్థకమైనవిగా పరిగణించి ముగించడం గమనార్హం. అయితే భావప్రకటనా స్వేచ్ఛకు సంబంధించిన ప్రశ్నలకు ఇంకా సమాధానాలు లభించలేదు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ అనేది నిరంతరం సవాళ్లను ఎదుర్కొంటూనే ఉంది. కాలం మారినా, ప్రభుత్వాలు మారినా, అధికారంలో ఉన్న శక్తులు తమను ప్రశ్నించే మీడియా గొంతును అణచివేయడానికి చట్టాలను, అధికార యంత్రాంగాన్ని ఆయుధాలుగా వాడుకున్న సందర్భాలు స్పష్టంగా కనిపిస్తాయి. వ్యక్తిగత గోప్యత ముఖ్యమే అయినా, ప్రభుత్వ లేదా ప్రజా పదవుల్లో ఉన్నవారి దుష్ప్రవర్తనపై చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా పరిశీలన జరగకుండా అడ్డుకోవడానికి గోప్యతను ఒక సాధనంగా ఉపయోగించకూడదు. వ్యక్తుల గోప్యతను కాపాడటం, అధికారంలో ఉన్న వారిని ప్రశ్నించడానికి పాత్రికేయులకు అవకాశం కల్పించడం ఈ రెండూ పరస్పర విరుద్ధమైన లక్ష్యాలుగా ఉండకూడదు. ఈ రెండింటి మధ్య సమతుల్యతను చట్టమే కాపాడాలి.

యువతలో బిజెపిపై వ్యతిరేకత కనిపిస్తోంది: మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్: నాగ్‌పూర్‌లో బిజెపిని ఓడించామని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. బిజెపికి బ్యాలెట్ ద్వారా బుల్లెట్ దించామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..ప్రధాని నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలోనూ బిజెపి ఓటమి పాలైందని, బిజెపి జాతీయ అధ్యక్షుడి స్థానంలోనూ ఓడిపోయిందని వ్యాఖ్యానించారు. బిజెపి పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని, ముఖ్యంగా యువతలో అసంతృప్తి కనిపిస్తోందని అన్నారు. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న ర్యాలీలో పాల్గొంటామని, రైళ్ల కేటాయింపు విషయంలో కేంద్రంపై ప్రధాని మోదీ ఒత్తిడి కారణంగానే రైళ్లు కేటాయించడం లేదని ఆరోపించారు. రైళ్లు ఇవ్వకపోతే బస్సుల్లో వెళ్లి ర్యాలీలో పాల్గొంటామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ అభివృద్ధికి

కేంద్రంతో కలిసి ముందుకు సాగుతామని పేర్కొన్నారు. రెండు కొత్త విమానాశ్రయాలను కేంద్రం మంజూరు చేసిందని వివరించారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు భారత్ సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. దేశంలో, హైదరాబాద్‌లో ఏరోస్పేస్ అభివృద్ధికి రాజీవ్‌గాంధీ బీజం వేశారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ప్రధానిపీవీ నరసింహారావు దేశంలో ఎల్పీజీ సంస్కరణలు ప్రవేశపెట్టారని పునరుద్ఘాటించారు. ఆర్థిక సంస్కరణలు అమలు చేసిన పీవీ తెలంగాణ వ్యక్తి కావటం గర్వకారణమని అన్నారు. హైదరాబాద్ చుట్టూ ఆర్ఆర్ఆర్ నిర్మిస్తామని కేంద్రం ఇప్పటికే హామీ ఇచ్చిందని, అది హైదరాబాద్?కు మరో గేమ్? ఛేంజర్? అవుతుందన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమగ్ర అభివృద్ధికి

(గురువారం) రాష్ట్ర సచివాలయంలో భట్టి విక్రమార్క ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో కీలక అంశాలపై చర్చించారు. ఈ సమీక్షలో ఎస్సీ, ఎస్టీల సమగ్ర అభివృద్ధిపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

కులం, మతం, డబ్బుతో దేశాన్ని

'భారత్ కీ సోచ్' మంత్రం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ కోసం పౌరుల విధులపై చర్చా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్య నాయుడు కీలక ప్రసంగం చేశారు. మాజీ ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ.. వికసిత్ భారత్ కోసం ప్రజలంతా పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. 'సర్వేజనా సుఖినోభవంతు', 'వసుధైవ కుటుంబం' అనే నినాదాలతో భారత్ ముందుకు సాగుతోందన్నారు. సమాజంలో ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములవుతూ దేశభక్తితో మెలగాలని పిలుపునిచ్చారు. దేశంలో నెలకొన్న పరిస్థితులపై ప్రజలు ఆలోచించాలని, అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఓటు ద్వారా ప్రజలు మార్పును సాధించవచ్చని చెప్పుకొచ్చారు. సమాజంలో శాంతియుత వాతావరణం ఎంతో ముఖ్యమని, అనవసర ఆందోళనల వల్ల నష్టం జరుగుతుందని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. కుటుంబం నుంచి ప్రపంచం వరకు శాంతి ఎంతో అవసరమని చెప్పారు. పిల్లలు మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా ప్రజల ఆలోచనా శక్తి, సృజనాత్మకత తగ్గకూడదనీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దేశానికి మేలు చేయాలనే ఉద్దేశంతో వికసిత్ భారత్ కోసం కృషి చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కోరారు.

పోలీసుల లాఠీలకు

విద్యార్థి సంఘాలన్నీ ఈ మార్చ్‌లో పాల్గొనాలని కోరారు. ఇదో అద్భుతమైన మార్చ్ కాబోతుందని అన్నారు. ఇది కేవలం ఒక నిరసన మాత్రమే కాదని, ఈ దేశ ఆత్మ కోసం చేస్తున్న ప్రదర్శనగా రాహుల్ గాంధీ అభివర్ణించారు.

"చలో దిల్లీ రాంలీలా మార్చ్, ఇది ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి, ఓటు చోరీని అరికట్టడానికి, రాజ్యాంగాన్ని రక్షించడానికి చేపట్టిన పాదయాత్ర. ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీది కాదు, ఇది భారతదేశ ఆత్మ పాదయాత్ర. నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్‌లతో విసిగిపోయిన ప్రజలందరూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుకునేవారు, రాజ్యాంగాన్ని రక్షించాలని కోరుకునే వారందరూ రావాలి. పోలీసులు, లాఠీల గురించి భయపడకండి. కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బీజేపీకి లేదు. మాతో కవాతు చేయండి. రాజ్యాంగాన్ని, దేశాన్ని రక్షించడానికి మనం కలిసి నడుద్దాం. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇది దేశం కోసం జరుగుతున్న యాత్ర, ఇది మీ యాత్ర. మీరందరూ రండి మనమందరం కలిసి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం. భారతదేశంపై దాడి జరుగుతోందని, భావ వ్యక్తీకరణపై, ఆలోచనలపై, దాడి జరుగుతోందని మీరు భావిస్తే రాజకీయలతో సంబంధం లేకుండా వచ్చి మాతో చేరండి. ఇది ఒక అద్భుతమైన యాత్ర కానుంది. ఇది మన దేశ ఆత్మను కాపాడేందుకు జరుగుతున్న యాత్ర."

మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో 'ఇండీ' కూటమికి చెందిన ఎంపీలు సమావేశమయ్యారు. ఖర్గేతో పాటు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్?, గౌరవ్ గొగోయ్? సహా ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు. శుక్రవారం జరగబోయే 'మాక్ పార్లమెంట్'తో పాటు ర్యాలీ ఏర్పాట్లపై చర్చించారు. మాక్? పార్లమెంట్?లో ప్రధాన ఎన్నికల కమిషనర్ (జజుజ) జ్ఞానేష్ కుమార్‌పై ప్రతీకాత్మకంగా 'అభిశంసన' ప్రక్రియను చేపట్టాలని వారు భావిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పార్లమెంటరీ కార్యకలాపాల తరహాలో నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం ప్రక్రియ ఒక పార్లమెంటు సమావేశంలా ఉంటుందని, ఇందులో అధికార, ప్రతిపక్షాలు ఉంటాయని పార్టీ వర్గాలు చెప్పాయి. సుమారు 40 మంది వక్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఈ కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. ఈ 'మాక్ పార్లమెంట్' తర్వాత నవంబర్ 1న భారీ బహిరంగ సభ (ర్యాలీ) జరగనుంది.

బ్యాలెట్ ద్వారా బీజేపీకి

వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఆయన గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ నియోజకవర్గమైన వారణాసి, ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉన్న నాగ్‌పూర్‌లలో బీజేపీ ఓటమిని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. నాగ్‌పూర్ పట్టభద్రుల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అభిజిత్ వంజారి, బీజేపీ అభ్యర్థి సుధాకర్ కోహ్లేపై 3,271 ఓట్ల తేడాతో విజయం సాధించారని మహేశ్ గౌడ్ గుర్తుచేశారు. బీజేపీకి కంచుకోటలాంటి, కేంద్ర మంత్రి గడ్కరీ, ఫడ్నవీస్ వంటి నేతలు ప్రచారం చేసిన నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ గెలవడం సాధారణ విషయం కాదన్నారు. ఇది

బీజేపీ సిద్ధాంతాన్ని అక్కడి విద్యావంతులు, యువత తిరస్కరించడానికి నిదర్శనమని పేర్కొన్నారు. వారణాసిలో ఓటమి మోదీ పాలనపై ప్రజా వ్యతిరేకతను సూచిస్తోందని, ఈ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ మోదీ తన వైఫల్యాలను అంగీకరించాలని డిమాండ్ చేశారు. ధైర్యముంటే ఈ ఫలితాలపై మోదీ ప్రెస్ మీట్ పెట్టాలని, గత 12 ఏళ్లుగా ఒక్క మీడియా సమావేశం కూడా నిర్వహించని ప్రధాని కేవలం ట్వీట్లకు పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఓడిపోతే ప్రభుత్వ వ్యతిరేకత అనే బీజేపీ, వారణాసిలో ఓటమిని ఎందుకు మోదీకి వ్యతిరేకంగా చూడదని ప్రశ్నించారు. లక్నో నుంచి పట్నా వరకు బీజేపీకి ఎదురుదెబ్బలు తగులుతున్నాయని, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సొంత ప్రాంతమైన గోరఖ్‌పూర్‌లో కేవలం 307 ఓట్ల మెజారిటీతో గెలవడమే దీనికి నిదర్శనమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి మూడంకెల సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో బీజేపీయేతర శక్తులకు ప్రజా మద్దతు పెరుగుతోందని, ఆయనే తదుపరి ప్రధాని అవుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. 'ఓట్ల దొంగతనం'ను నిరసిస్తూ నవంబర్ 1న ఢిల్లీలో భారీ నిరసన చేపట్టనున్నామని, జాబితా నుంచి తొలగించిన 13.3 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

నేను అప్పుడు అలా

అప్పట్లో ప్రతిపక్షంపై చేసిన రాజకీయ విమర్శల్లో భాగంగానే ఆ వ్యాఖ్యలు చేశానని, కేటీఆర్‌ను గానీ, ఆయన కుటుంబ సభ్యులను గానీ ఉద్దేశపూర్వకంగా కించపరిచే ఉద్దేశం తనకు లేదని సురేఖ తన పోస్టులో స్పష్టం చేశారు. ఆ వ్యాఖ్యలను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన క్యాబినెట్ నుంచి కొండా సురేఖను తొలగించిన కొన్ని రోజులకే ఈ పరిణామం జరగడం గమనార్హం. సరైన వివరణ ఇవ్వకుండా తనను మంత్రి పదవి నుంచి తొలగించడంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ మహిళను కావడం వల్లే తనను తప్పించారా అని కూడా ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కొండా సురేఖ, ఆమె భర్త మురళి కాంగ్రెస్‌ను వీడి తిరిగి సొంత గూటికి (బీఆర్ఎస్) చేరవచ్చని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. కేటీఆర్‌తో ఉన్న పాత విభేదాలను పరిష్కరించుకుని, పార్టీలో చేరేందుకు మార్గం సుగమం చేసుకోవడంలో భాగంగానే ఈ క్షమాపణ చెప్పారని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ పరిణామంపై బీఆర్ఎస్ నాయకత్వం నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు.

102 ఉద్యోగాలకు టీజీపీఎస్సీ నుంచి

ప్రధాన సబ్జెక్టుగా చదివి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు మాత్రమే ఈ ఉద్యోగాలకు అర్హులు. వయోపరిమితి విషయానికొస్తే, 2026 జులై 1 నాటికి అభ్యర్థుల వయసు కనీసం 18 ఏళ్లు నిండి, 44 ఏళ్లకు మించకూడదు. అయితే, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు వంటి రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయి. దరఖాస్తు రుసుముగా ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.1000 చెల్లించాల్సి ఉండగా, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.500గా నిర్ణయించారు. ఆకర్షణీయమైన వేతనం.. కీలకమైన బాధ్యతలుఈ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆకర్షణీయమైన వేతన స్కేలుతో పాటు సమాజంలో కీలక పాత్ర పోషించే అవకాశం లభిస్తుంది. కమిషన్ ప్రకటించిన ప్రకారం, ఉద్యోగంలో చేరిన వారికి నెలవారీ వేతనం రూ.36,750 నుంచి రూ.1,06,990 వరకు ఉంటుంది. ప్రభుత్వ పథకాల ప్రణాళిక, అమలులో ఈ పోస్టులది కీలక పాత్ర. మండల స్థాయిలో ప్రభుత్వానికి అవసరమైన గణాంకాలను సేకరించడం, వాటిని విశ్లేషించడం, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించడం వంటివి వీరి ప్రధాన బాధ్యతలుగా ఉంటాయి. పరీక్ష విధానం.. ముఖ్యమైన తేదీలు ఈ పోస్టుల భర్తీకి సంబంధించి రాత పరీక్షను జనవరి నెలలో నిర్వహించేందుకు కమిషన్ సన్నాహాలు చేస్తోంది. పరీక్షకు వారం రోజుల ముందుగా అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అక్టోబర్ 30న దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానున్నందున, ఆసక్తిగల అభ్యర్థులు చివరి తేదీ అయిన నవంబర్ 27 వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని కమిషన్ సూచించింది. జోన్ల వారీగా ఖాళీలు, సిలబస్, పరీక్ష విధానం వంటి పూర్తి వివరాల కోసం అధికారిక నోటిఫికేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు. ఏవైనా మార్పులు ఉంటే, వాటిని కమిషన్ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే వెల్లడిస్తుంది.

పబ్లిక్ గొంతు నొక్కడం ఏ రకమైన

సమాచారం ప్రకారం మూసీ ప్రాజెక్టు ముసుగులో వేలాది ఎకరాల లూటీకి ఈ ముఖ్యమంత్రి తెరలేపారు.. అందుకే పబ్లిక్ హియరింగ్ అంటే ఉలిక్కి పడుతున్నరు.. అందుకే పబ్లిక్ హియరింగ్ అంటే ఉలిక్కి పడుతున్నరు.. భయపడుతున్నరు.. పబ్లిక్ రాకుండా తూతూ మంత్రంగా ఏదో చేశామంటే చేశామనిపించుకోవడానికి ఒక ప్రొసీజరల్ ఇష్యూలాగా చాప కింద తోసేసే ప్రయత్నం చేస్తున్నారు..దీన్ని వదిలిపెట్టే పరిస్థితి లేదు.. ఒక వైపు కరువులో రాష్ట్రం ఉంటే అన్నదాతలు అల్లాడుతుంటే ఎండిన పంటలతో ఇవాళ పశుగ్రాసం లేక చివరికి పశువులు అల్లాడిపోతుంటే, నీళ్లు లేక హైదరాబాద్ ప్రజలు మొత్తుకుంటుంటే 10 టీఎంసీల నీళ్లు మల్లన్నసాగర్‌లో నుంచి తీసుకొచ్చి మూసీలో పోస్తడట.. ఎవడన్నా బుద్ధున్న ముఖ్యమంత్రి ఇట్లా పని చేస్తడా..? అని కేటీఆర్ ఫైర్ అయ్యారు. సాగునీటికి దిక్కులేదు.. తాగునీటికి దిక్కులేదు.. కానీ 10 టీఎంసీల నీటిని తీసుకొచ్చిమూసీలో పోసి సుందరీకరిస్తడట.. మింగమెతుకు లేదు కానీ.. మీసాలకు సంపెంగ నూనె అని యెనకటికి ఒక సామెత ఉండేది.. అట్లా ఉంది ముఖ్యమంత్రి ఆలోచనా విధానం.. ఈ ముఖ్యమంత్రిని, ప్రభుత్వాన్ని, ముఖ్యంగా ఈ ముఖ్యమంత్రి మా నెత్తిమీద రుద్దిన రాహుల్ గాంధీని అడుగుతున్నా.. మీవి ఏ రకమైన ప్రాధాన్యాలని కేటీఆర్ అడిగారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు

అమలాపురం, కాట్రేనికోన ప్రాంతాల్లో నీట మునిగిన పొలాలను, కూలిన కొబ్బరి చెట్లను పరిశీలించి అన్నదాతలతో మాట్లాడారు. ఏయే ప్రాంతాల్లో ఏ మేరకు నష్టం జరిగిందనే అంశాలను సీఎం చంద్రబాబుకు.. తన సెక్రటరీ ప్రద్యుమ్నా వివరించారు.

బియ్యం బ్లాక్ మార్కెట్ చేస్తే

చేస్తున్నామని తెలిపారు. రైస్ ఇల్లీగల్ బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాక్‌కు మించి బియ్యం నిల్వ చేస్తే కేసులు పెడతామని స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. రైస్ మిల్లర్స్, హోల్ సేలర్స్, రీటైలర్స్‌ను పిలిచి బియ్యం ధరలు తగ్గించాలని చెప్తున్నామని అన్నారు. ధరలు ఎందుకు పెరుగుతున్నాయన్న దానిపై స్టడీ చేస్తున్నామని.. బియ్యం ధరలు తగ్గించని వారిపై కేసులు తప్పవని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది అక్టోబర్ వరకు బియ్యం నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. 28 ఎల్ఎమ్‌టీ స్టాక్స్ ఉన్నాయని తెలిపారు. 25 కేజీలకు బదులు 23, 24 కేజీల రైస్ బ్యాగ్‌లను అమ్ముతున్నట్లు సమాచారం వచ్చిందని.. అలాంటి వారి ట్రేడ్ లైసెన్స్‌లను రద్దు చేస్తామని సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు.

మల్లన్నసాగర్‌కు అతీ

దూరంలో బ్లాస్టింగ్‌కు సంబంధిత శాఖల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని ఆరోపించారు. తాను ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారుల వరకు ఫోన్ చేసి అడిగితే సమాచారం లేదంటూ సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. పేలుళ్ల వల్ల ఇళ్లు డ్యామేజ్ అవుతున్నాయని గ్రామ సర్పంచు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా పనులు చేస్తున్నారని ఆరోపించారు.

రాజకీయాల కోసం కుట్రలు 16లక్షల 23 వేల ఎకరాలకు నీరు ఇచ్చే మల్లన్నసాగర్‌ను రాజకీయాల కోసం కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే బ్లాస్టింగ్ పనులు ఆపాలని, పేలుళ్ల వల్ల మల్లన్నసాగర్ కట్టకు ఏమైనా నష్టం జరిగిందా అనే విషయాన్ని నిపుణులతో పరిశీలింపజేయాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా పనులు చేపట్టిన అధికారులను సస్పెండ్ చేయాలని , ఏజెన్సీపై యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, పోలీసులు వెంటనే కేసులు నమోదు చేయాలని కోరారు.

తిప్పారం గ్రామంలో దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం చెల్లించి కొత్త ఇళ్లను కట్టించాలని కోరారు. మల్లన్నసాగర్ కోసం భూములిచ్చిన రైతులను బెదిరించి రూ.10 లక్షల పరిహారం మాత్రమే ఇచ్చారని ఆరోపించారు.

ఉమ్మడి చిల్కానగర్ డివిజన్‌లో రూ.49.75 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

--- అభివృద్ధిలో దూసుకుపోతున్న చిల్కానగర్, బీరప్పగడ్డ డివిజన్లు

--- కాలనీలు, బస్తీల అభివృద్ధికి నిరంతరం నిధులు కేటాయిస్తున్నాం: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, అక్టోబర్ 29 (నమస్తే హైదరాబాద్):
ఉప్పల్ నియోజకవర్గంలోని ఉమ్మడి చిల్కానగర్ డివిజన్ పరిధిలో రూ.49.75 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. చిల్కానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి, సాయిరాం నగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌కు సంబంధించిన పెండింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే చిల్కానగర్ డివిజన్ పరిధిలోని ఆదర్శ్ నగర్ కాలనీలో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి, చిల్కానగర్ బొడ్రాయి వెనుక వీధిలో మరో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటుకు పనులు ప్రారంభించారు.ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులుఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలోని ఇతర డివిజన్లతో పోలిస్తే చిల్కానగర్, బీరప్పగడ్డ డివిజన్లలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఆయా డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం నిధులు కేటాయిస్తూ కాలనీలు, బస్తీలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళు న్నామని వివరించారు. మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనుల అమలుకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఆమె నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ కాలనీలు, బస్తీల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దశలవారీగా మిగిలిన పనులు పూర్తి చేస్తాంమాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్‌లో ఇప్పటివరకు సుమారు 85 శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులను కూడా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో దశలవారీగా పూర్తి చేస్తామని వెల్లడించారు.చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ సహకరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారని కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చిల్కానగర్, బీరప్పగడ్డ డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీవారి ఆశీస్సులు పొందిన గడ్డం రవికుమార్ ఆశీర్వచనంతో పాటు ప్రసాదం అందజేసిన టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర

--- ప్రత్యేక దర్శనం అనంతరం టీటీడీ ఈవో చేతుల మీదుగా ఆశీర్వచనం, ప్రసాదం స్వీకరణ

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే హైదరాబాద్):
ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని గురువారం గడ్డం రవికుమార్, డైరెక్టర్ త్రినాథరావు నక్కిన, వై వి రెడ్డి లు ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి సేవలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) ఈవో ఎం. రవిచంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర తన చేతుల మీదుగా వారికి స్వామివారి ఆశీర్వచనంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. స్వామివారి దర్శనం అనంతరం ఈవో నుంచి ఆశీర్వచనం, ప్రసాదం అందుకోవడం పట్ల గడ్డం రవికుమార్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ త్రినాథరావు నక్కిన, వై.వి. రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శ్రీవారి దర్శనం, ఆశీర్వచనం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని, మనశ్శాంతిని అందిస్తాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ నవంబర్ 6లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

--- గుడి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో చిలుకా నగర్ చౌరస్తాలో ఎమ్మెల్సీ ఓటర్ నమోదు అవగాహన సదస్సు

చిలుకానగర్, అక్టోబర్ 29 (నమస్తే హైదరాబాద్):
ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు చిలకనగర్ చౌరస్తాలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన సదస్సుతో పాటు ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అర్హులైన ఓటర్లకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయాలంటే ముందుగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. అర్హత కలిగిన వారు నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైన పత్రాలను సమర్పించి ఓటరు నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు.నవంబర్ 6వ తేదీ ఓటరు నమోదు కోసం చివరి గడువు కావడంతో అర్హులైన వారందరూ ఆ తేదీలోపు తమ దరఖాస్తులను సమర్పించి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవడం ద్వారా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి అర్హుడి భాగస్వామ్యం అవస రమని, ఓటరు జాబితాలో పేరు లేకపోవడం వల్ల ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకూడదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఓటరు నమోదు ప్రాముఖ్యతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పిం చాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం ద్వారా ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన వారిని నమోదు దిశగా ప్రోత్సహించారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సు.

వేలేరు, అక్టోబర్ 29 (నమస్తే హైదరాబాద్)::

హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డి ఎల్ ఎస్ ఏ) ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా పోక్సో చట్టం, బాల్యవివాహాలు, గంజాయి, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, మోటార్ వెహికల్ చట్టంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత విద్యను అభ్యసించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, ఆపద సమయంలో సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య, ఎంఈఓ చంద్రమౌళి, జిల్లా న్యాయస్థాన న్యాయవాది కోడూరి.రవి, వేలేరు ఎస్సై నరేష్, ఉపాధ్యయులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని, సుప్రీంకోర్టు నిర్ణయాలను విస్మరించే నిరంకుశ పోకడలను తిప్పికొడదాం

- మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్
- నవంబర్ 2న హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్రను విజయవంతం చేయాలి
- హెచ్ఎంటీ నగర్ డివిజన్ నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావాలి
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటరు నమోదుపై కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలి

నాచారం, అక్టోబర్ 29 (నమస్తే హైదరాబాద్):
ప్రజాపాలనను తుంగలో తొక్కుతూ, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని, రాజ్యాంగాన్ని తప్పుపట్టే విధానాలను, అత్యున్నత న్యాయస్థానం నిర్ణయాలను విస్మరించే అధికార దుర్వినియోగ పోకడలను తిప్పికొట్టాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు బీజేపీ కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు.నవంబర్ 2న హైదరాబాద్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పాల్గొననున్న పాదయాత్రను విజయవంతం చేయడానికి హెచ్ఎంటీ నగర్ డివిజన్ బీజేపీ కార్యకర్తలతో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ట్యాంక్ బండ్‌పై నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి హెచ్ఎంటీ నగర్ డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.
మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో నవంబర్ 2న జరగనున్న పాదయాత్రకు సంబంధించిన కార్యాచరణపై చర్చించారు. డివిజన్ పరిధిలోని ప్రతి బూత్ నుంచి కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభాకర్ సూచించారు.

జవహర్‌నగర్ డంపింగ్ యార్డును ఎత్తివేయాలి
జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తొలగించాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ చేపట్టనున్న పాదయాత్ర ముగింపు సందర్భంగా నిర్వహించే బహిరంగ సభను కూడా విజయవంతం చేయాలని ప్రభాకర్ కార్యకర్తలకు సూచించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పార్టీ శ్రేణులు ప్రజలతో కలిసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

----పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి
రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యతను ప్రతి కార్యకర్త తీసు కోవాలని ప్రభాకర్ కోరారు. తమ కుటుంబ సభ్యులు, బం ధువులు, స్నేహితుల్లో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారికి ఓటరు నమోదుపై అవగాహన కల్పించి నమోదు ప్రక్రియను పూర్తి చేయించాలని సూచించారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలను కైవసం చేసుకునే లక్ష్యంతో పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని అన్నారు.
ఈ సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు చంద్రమౌళి, కార్మిక విభాగం జిల్లా కన్వీనర్ యోగేశ్వర్ రెడ్డి, రాజిరెడ్డి, మోర నర్సింహారెడ్డి, చిల్లా అశోక్, గంధమల గోపి, కిరణ్ కుమార్, రమేష్, వేణుగోపాల్, సురేందర్ స్వామి, శేఖర్ గుప్తా, ఉప్పలయ్య, బాలరాజ్, క్రాంతికుమార్, కిషోర్, సాగర్, మంజులవాణి, పార్వతి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి.

భార్య, రెండేళ్ల కుమార్తెను వదిలి వెళ్లడంతో కుటుంబంలో విషాదం.



వేలేరు, అక్టోబర్ 29, (నమస్తే హైదరాబాద్)::
హనుమకొండ జిల్లా వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామ శివారులో ఈ నెల 20న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పీచర గ్రామానికి చెందిన మాతంగి రాజేష్ (33) చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. వరంగల్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా, మల్లికుదుర్ల శివారులోని చెరువు వద్ద ఎదురుగా వచ్చిన టాటా ఏస్ వాహనం ఢీకొట్టడంతో రాజేష్ తీవ్రంగా గాయపడ్డాడు.మొదట వరంగల్‌లో చికిత్స పొందిన రాజేష్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. రాజేష్ మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.

మీ గళం.. మా కలం..!
నమస్తే హైదరాబాద్
NAMASTHE HYDERABAD తెలుగు దిన పత్రిక RNI No: APTEL/2012/45237
శుక్రవారం 30-10-2026

యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడితో పవన్ కుమార్ భేటీ

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి జక్కిడి శివచరణ్ రెడ్డి

నంగునూరు, / సయ్యద్ జహీర్ / అక్టోబర్ 29 (నమస్తే హైదరాబాద్): తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డిని సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు సాదుల పవన్ కుమార్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. యువజన కాంగ్రెస్ నాయకులకు పదవులు, బాధ్యతలు దక్కడం సంతోషకరమని శివచరణ్ రెడ్డి అన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వాటిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ నంగునూరు మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ సిద్ధాంతాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. యువతను పార్టీ వైపు ఆకర్షించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పిడిశెట్టి ప్రభాకర్, సిర్రం భాను తదితరులు పాల్గొన్నారు.

18 రోజులకు చేరుకున్న ఎన్ఎంహెచ్ ఉద్యోగుల సమ్మె గ్రామీణ ప్రాంతాల్లో ఆగిపోయిన వైద్య సహాయం

హనుమకొండ అక్టోబర్ 29 నమస్తే హైదరాబాద్ హనుమకొండ జిల్లాలో కలెక్టర్ ఆఫీస్ ఎదుట ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల18 రోజులకు చేరుకున్న సమ్మె కాలం గ్రామీణ ప్రాంతాలలో ఆగిపోయిన వైద్య సేవలు పిల్లలకి టీకాలు బిపి షుగర్ మందులు ఇవ్వక ప్రజలు అవస్థలు 20 సంవత్సరాల నుండి 78 కేడర్ల ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు చాలీచాలని జీతాలతో జీవితాలు గడుపుతున్నారనితెలంగాణ వస్తే కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాలు మారుతాయి పర్మినెంట్ అయితదని ఆశ పడ్డామని కానీ ఇప్పటివరకు పర్మినెంట్ కాలేదని ఇప్పటికైనా ప్రభుత్వం మమ్ములను గుర్తించి రెగ్యులరైజ్ చేయాలని లేదా 100%గ్రాస్ శాలరీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాను ఎన్ హెచ్ జాక్ వ్యవస్థాపకులు డాక్టర్ పుట్ట మహేందర్ తెలిపినారు

కళ్ళలో కారం చల్లి మహిళా మెడలో బంగారు గొలుసు అపహరణ

జనగాం జిల్లా , దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్): దేవరుప్పుల మండలంలోని కామారెడ్డి గూడెం గ్రామంలో గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మహిళ కళ్ళలో కారం చల్లి మెడలోని బంగారు ఆభరణాలను అపహరించాడు, తండ సుగుణమ్మ భర్త రామస్వామి ఇంటి వద్ద ఉండగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి నళ్ళాల యాదగిరి ఎక్కడ ఉంటాడని అడిగాడు, కొత్త ఇళ్ల వైపు ఉంటాడని ఆమె చెప్పింది, అనంతరం నీళ్లు పట్టేందుకు బయటకు వచ్చిన సుగుణమ్మ పై నిందితుడు కారం చల్లి ఆమె మెడలోని బంగారు గొట్టాల గొలుసు, పుస్తెలతాడును లాక్కొని పరారయ్యాడు, అపహరణకు గురైన ఆభరణాల బరువు సుమారు మూడు తులాల పావు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవరుప్పుల ఎస్సై చింత రాజు తెలిపారు.

హైదరాబాద్ పోలీసులకు స్మార్ట్ ఈవీ వాహనాలను ప్రారంభించిన డీజీపీ ఆనంద్

హైదరాబాద్, అక్టోబరు 29: హైదరాబాద్ సిటీ పోలీసులకు 15 ఈవీ స్మార్ట్ వాహనాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ (గురువారం) పెట్లబురుజు సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడారు. స్పందన బృందాలకు - 7, శాంతిభద్రతల విధులకు - 8 టాటా పంచ్ ఈవీ కార్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. టాటా పంచ్ ఈవీ కారుకు ఒక్కసారి ఛార్జ్ చేస్తే 468 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ వాహనాలు 40 కిలోవాట్ అవర్ బ్యాటరీ సామర్థ్యం కలిగి ఉన్నాయని వివరించారు.

ఇరుకైన వీధులు, గల్లీల్లోకి సైతం వేగంగా చేరుకునేలా కొత్త ఎలక్ట్రిక్ వాహనాలను అమల్లోకి తీసుకువచ్చామని వెల్లడించారు.సీఎస్సార్ కింద వాహనాలను హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ) సమకూర్చిందని డీజీపీ చెప్పారు. డయల్ - 112 కంట్రోల్ రూమ్ సమన్వయంతో క్షణాల్లో ఘటనా స్థలానికి స్పందన వాహనాలు చేరుకుంటాయని తెలిపారు. భాగ్యనగరంలోని 7 లా అండ్ ఆర్డర్ జోన్లలో 14 స్పందన బృందాలు విధుల్లో ఉంటాయని అన్నారు. ప్రతి వాహనంలో మహిళా డ్రైవర్, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు ఉంటారని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10గంటల నుంచి అర్ధరాత్రి 12:30 గంటల వరకు రెండు షిఫ్టుల్లో స్పందన సేవలు అమల్లో ఉంటాయని చెప్పారు. ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలూ పనిచేస్తుందని వివరించారు.గత 185 రోజుల్లో 8,903 ఫిర్యాదులకు స్పందన బృందాలు స్పందించాయని డీజీపీ చెప్పుకొచ్చారు. 1,900 సమస్యలను కౌన్సెలింగ్ ద్వారా, 1,164 వివాదాలను రాజీతో పరిష్కరించినట్లు వెల్లడించారు. 2,504 కేసులు స్థానిక ఠాణాలకు బదిలీ, 61 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని తెలిపారు. తప్పిపోయిన నలుగురు చిన్నారులను గుర్తించి తల్లిదండ్రులకు స్పందన బృందాలు అప్పగించాయని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. మహిళా పోలీస్ డ్రైవర్ల ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే కొత్త ఈవీ వాహనాలను తీసుకువచ్చామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు.

నేషనల్ కాన్ఫరెన్స్ కు రావాల్సిందిగా ఢిల్లీ మంత్రి రవీందర్ సింగ్ కు ఆహ్వానం

---ఆహ్వాన పత్రాన్ని అందజేసిన బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, టేకి రాజశేఖర్

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే హైదరాబాద్): బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ కమిటి ఆధ్వర్యంలో నవంబర్ 15 వ తేదీన న్యూ ఢిల్లీ లో నిర్వహించబోయే బహుజన రైటర్స్ 20 వ నేషనల్ కాన్ఫరెన్స్ కు రావాల్సిందిగా ఢిల్లీ రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి రవీందర్ ఇంద్రాజ్ సింగ్ ను ఆహ్వానించిన బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ తెలంగాణ జాయింట్ సెక్రటరీ టెకి రాజశేఖర్ లు ఆహ్వానించారు. గురువారం ఢిల్లీ లోని రాజ్ నివాస్ మార్గ్ నందుగల మినిస్టర్ క్వార్టర్స్ నందు కలిసి కాన్ఫరెన్స్ కు సంబంధించిన వివరాలు తెలియ జేయడం జరిగింది. బహుజన సాహిత్య అకాడమీ దేశం లో 28 రాష్ట్రాలలో.. ప్రపంచం లో 10 దేశాల విస్తరించి ఉన్నదని ఆయా ప్రాంతాల నుండి సుమారుగా 1000 మంది డెలివేట్స్ ఈ కాన్ఫరెన్స్ కు హాజరవుతారని తెలియ జేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభయ్యే ఈ కాఫరెన్స్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని తెలియ జేశారు. కళాకారుల, నృత్యకారుల మరియు కవులు రచయితల చే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించ బడుతాయనీ తెలియ జేశారు.మంత్రి తో పాటుగా ఢిల్లీ కరోల్ బాగ్ ఎమ్మెల్యే విశేష్ రవిజి , భారత ప్రభుత్వ సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ సుధారాణి రేలంగి ఐ ఎల్ ఎస్ లను కూడా ఆహ్వానించడం జారినట్లు తెలియ జేశారు

ధర్మసాగర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఎఫ్‌పీఓ మహాజన సభ

రైతులకు షేర్ బాండ్ సర్టిఫికెట్ల పంపిణీ

ధర్మసాగర్ అక్టోబర్ 29 నమస్తే హైదరాబాద్ ధర్మసాగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో గురువారం రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ) మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీఓ సభ్యులైన రైతులకు పీఏసీఎస్ చైర్మన్ గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా షేర్ బాండ్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేసీటీసీ ప్రిన్సిపాల్ యాకుబ్ నాయక్ మాట్లాడుతూ, రైతుల సహకారంతో పాటు ఎన్‌సీడీసీ (చీజణజ) సహకారంతో రైతులకు ఉపయోగపడేలా ప్యాడీ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి పీఏసీఎస్ పాలకవర్గం, ఎఫ్‌పీఓ సభ్య రైతులు సుముఖంగా ఉన్నారని తెలిపారు. ఈ యూనిట్ ఏర్పాటు ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటూ, ప్రాజెక్టు విజయవంతం కావడానికి రైతులు, పాలకవర్గ సభ్యులు, సంబంధిత అధికారులు సమన్వయంతో ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.రైతుల అభివృద్ధి, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, రైతులకు మెరుగైన సేవలు అందించడంలో ఎఫ్‌పీఓ కీలక పాత్ర పోషించాలని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ధర్మసాగర్ నోడల్ ఆఫీసర్ కృష్ణవేణి, ఎఫ్‌పీఓ బిజినెస్ ఎక్స్‌పర్ట్ శ్రీ నరేష్, డీసీసీబీ ధర్మసాగర్ బ్రాంచ్ మేనేజర్ సౌందర్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యధా కుమారస్వామి పాల్గొన్నారు.అలాగే పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు బొడ్డు లెనిన్, పోలుమారి విజయ, బిల్లా అమరేందర్ రెడ్డి, బేరే వీరయ్య, మాచర్ల కనకరాజు, మురవత్ బిక్షపతి, మడికంటి రాజయ్య, శామల రమేష్ రెడ్డి, జంగా వీరయ్య, పీఏసీఎస్ కార్యదర్శి పింగిలి రాజిరెడ్డి, కార్యాలయ సిబ్బంది ఆవుల కుమారస్వామి, బొడ్డు ప్రభుదేవ్, పోలుమారి ప్రవీణ్ కుమార్, కలకోటి మురళీకృష్ణ, జల్తారు మహిరాజు, మామిడాల రాజేందర్, బైరి యాకయ్యతో పాటు పలువురు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాలల భద్రతపై అవగాహన అవసరం

- వేధింపులు ఎదురైతే మౌనంగా ఉండొద్దు..

ధైర్యంగా తెలియజేయాలి..

- జూనియర్ సివిల్ జడ్జి సాధన

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / అక్టోబర్ 29 (నమస్తే హైదరాబాద్): బాలల హక్కులు, వ్యక్తిగత భద్రతపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని సిద్దిపేట జూనియర్ సివిల్ జడ్జి బి సాధన సూచించారు. పిల్లలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టం–2012పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న "సురక్షిత్ బచ్పన్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా గురువారం సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, హైదరాబాద్, సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సుదర్శన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి సాధన మాట్లాడుతూ విద్యార్థినులు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు వ్యక్తిగత భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అసౌకర్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా భయపడకుండా తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని చెప్పారు. ఇటువంటి ఘటనలను మౌనంగా భరించకుండా ధైర్యంగా బయటకు చెప్పాలని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్లు, అంతర్జాలం వినియోగించే సమయంలో జాగ్రత్తగా ఉండా లని, తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలను పంచుకోవద్దని సూచించారు. పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షించేందుకు పోక్సో చట్టం–2012 అమలులో ఉందని, బాలల భద్రతకు చట్టపరమైన రక్షణలు ఉన్నాయని వివరించారు. విద్యార్థుల్లో బాలల హక్కులు, వ్యక్తిగత భద్రతపై అవగాహన పెంపొందించడం, వారిలో ఆత్మవిశ్వాసం నింపడం, చట్టపరమైన రక్షణల గురించి తెలియజేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పిఆర్సి ని వెంటనే ప్రకటించాలి

టీఎస్ యూటీఎఫ్ డిమాండ్

వేలేరు, అక్టోబర్ 29, నమస్తే హైదరాబాద్:: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ని వెంటనే ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవీందర్ రాజు డిమాండ్ చేశారు. గురువారం వేలేరు మండలం లోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ,మల్లికుదుర్ల,కన్నారం ఉన్నత పాఠశాలల్లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడగానే ఆరు నెలల్లో పీఆర్సీ ఇస్తామని, పెండింగ్ డిఏ లు విడుదల చేస్తామని మేనిఫెస్టోలో పెట్టి ఇప్పటికి 40 నెలలు గడిచినప్పటికీ నేటికీ పీఆర్సీ అమలు చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.. పీఆర్సీ నివేదికను వెంటనే బహిర్గతం చేసి తక్షణం అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు ..ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ద్వారా 40% ఫిట్మెంట్ అమలు చేయాలని అన్నారు.. అలాగే పెండింగ్లో

ఉన్న ఐదు విడతల డీఏలు విడుదల చేయాలని ,పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని ఈ సందర్భంగా అన్నారు.. కేజీబీవీ మహిళా ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలని, ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసే విధంగా ఉన్న జీవో 25 ను వెంటనే సవరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు డి కిరణ్ కుమార్,జిల్లా కార్యదర్శి చుంచుకాల లింగారావు, వేలేరు మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.భాస్కర్, కె.పద్మలతలు పాల్గొన్నారు.

మీ గళం.. మా కలం...
నమస్తే హైదరాబాద్
NAMASTHE HYDERABAD తెలుగు దిన పత్రిక RNI No: APTEL/2012/45237
శుక్రవారం 30-10-2026

లాస్య మృతిపై సమగ్ర విచారణ జరపాలి

- శాంతియుత ధర్నాపై పోలీసుల దాడి..

అక్రమ అరెస్టులు దుర్మార్గం..

- యుఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ డిమాండ్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ /
అక్టోబర్ 29 (నమస్తే హైదరాబాద్):
సిద్దిపేట నియోజకవర్గం రాఘవపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని లాస్య అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత ఐక్య విద్యార్థి సమాఖ్య (యుఎస్ఎఫ్ఐ) సిద్దిపేట జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. లాస్య మృతికి గల కారణాలను నిగ్గు తేల్చి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ గురువారం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ వద్ద ఇతర విద్యార్థి సంఘాలతో కలిసి శాంతి యుతంగా ధర్నా నిర్వహిస్తుండగా పోలీసులు అప్రజా స్వామికంగా వ్యవహరించి నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని సంఘం నాయకులు ఆరోపించారు. అరెస్టు చేసే క్రమంలో పోలీసులు విచక్షణారహితంగా దాడి చేయడంతో నాయకుల చేతులకు తీవ్ర గాయాలయ్యాయని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును అణచివేయడం దుర్మార్గమని విమర్శించారు.

యుఎస్ఎఫ్ఐ ప్రధాన డిమాండ్లు ఇవే..
లాస్య మృతి ఘటనపై తక్షణమే ఉన్నతస్థాయి విచారణ జరిపి, ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలితే సంబంధిత పాఠశాల అధికారులను సస్పెండ్ చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే పరిహారం ప్రకటించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అన్ని విధాలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థినుల భద్రతపై కఠిన పర్యవేక్షణ చేపట్టి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం
లాస్య మృతి ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని యుఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించింది. ఈ ఆందోళన కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పలువురు బిఆర్ఎస్ నాయకులతో పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

బిజినేపల్లి జలసిరి పనుల తనకి

బిజినేపల్లి 29 . బిజినాపల్లి గ్రామపంచాయతీలో VBGRAMG. జలసిరి పథకాల ఆధ్వర్యంలో చేపడుతున్న బోర్వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్స్ పనులను టెక్నికల్ అసిస్టెంట్ పార్వతి పరిశీలించారు క్షేత్రస్థాయిలో పనులు జరుగుతున్న తీరును పరిశీలించే పలు సలహాలు సూచనలు అందజేశారు భూగర్భ జల మతాన్ని పెంపొందించి కోవడానికి ఇటువంటి బోర్వెల్ రీఛార్జ్ నిర్మాణాలు ఎంతో గాను దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు

నాగర్ కర్నూల్ జిల్లాలో 13 మండలాల్లో కరువు పరిస్థితులు

నాగర్ కర్నూల్ జిల్లా: ఖరీఫ్ సీజన్ పంటల నష్టం రైతులకు ఉపశమనం కల్పించే చర్యల్లో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లాలోని 13 మండలాల్లో కరువు పరిస్థితులను ప్రకటించారు వీటిలో పది మండలాలను తీవ్ర కరువు మూడు మండలాలను మద్యస్థ కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు తీవ్ర కరువు మండలాలుగా ఊరుకొండ. వెల్దండ. చారకొండ. వంగూరు. అచ్చంపేట. పదరా. బల్మూరు. లింగాల. కోడేరు పెద్ద కొత్తపల్లి. మద్యస్థ కరువు మండలాలుగా బిజినేపల్లి. కల్వకుర్తి. అచ్చంపేట ఉన్నాయి.

మహిళా మోర్చా అధ్యక్షురాలుగా స్వాతి

బిజినేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన బిజెపి మహిళ మోర్చా అధ్యక్షురాలుగా అన్నాతిపురపు స్వాతి నియమితులయ్యారు జిల్లా అధ్యక్షుడు నరేందర్ రావు ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు నాయకులు తెలిపారు ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నరేంద్ర రావు ప్రధాన కార్యదర్శిలు నాగేంద్ర గౌడ్ చంద్రకళ పాల్గొన్నారు చురుకగా పాల్గొంటూ దేశ అభివృద్ధి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు

ఓటు హక్కు పరిరక్షణకు కదం తొక్కుదాం.. చలో ఢిల్లీ ర్యాలీని విజయవంతం చేద్దాం

- ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం..

ఓటు చోరీకి వ్యతిరేకంగా గళమెత్తుదాం..

- నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా

మైదానంలో 'ఓటు బచావో..

దేశ్ బచావో' ప్రోగ్రాం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ /
అక్టోబర్ 29 (నమస్తే హైదరాబాద్):
ఓటు హక్కు పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువలను కాపాడటమే లక్ష్యంగా నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ.. ఓటు బచావో, దేశ్ బచావో'.. ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సికిందర్ పాషా పిలుపునిచ్చారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ మేరకు ప్రజలకు, ప్రజాస్వామ్య పరిరక్షణను ఆకాంక్షించే వారందరికీ విజ్ఞప్తి చేశారు. ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే

కాదని, ప్రజాస్వామ్యానికి పునాది అని సికిందర్ పాషా పేర్కొన్నారు. ప్రతి ఓటుకు విలువ ఉండాలని, ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉండాలని అన్నారు. ఓటరు హక్కులకు భంగం కలగకుండా కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు.

ఓటు చోరీ ఆరోపణలపై గళమెత్తుదాం..
ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం.. అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ ర్యాలీలో భాగస్వాములై ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమానికి మద్దతు తెలపాలని కోరారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడాలంటే పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ఓటరు హక్కుల పరిరక్షణ అంశాన్ని దేశవ్యాప్తంగా బలంగా వినిపించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు, ప్రజాస్వామ్య భవిష్యత్తును పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సికిందర్ పా షా కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, వారి ఓటు విలువను కాపాడుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

మంగనూరులో 30 తేదీ నుంచి గ్రామదేవతల ఉత్సవాలు

బిజినాపల్లి 29వ తేదీ బిజినపల్లి మండలంలోని మంగనూరు గ్రామంలో ఈనెల 30 నుంచి బొడ్రాయి కోట మైసమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు సర్పంచి జాలం నాగయ్య యాదవ్ తెలిపారు 30న బొడ్రాయి పూజలు మహిళల బోనాలు 31న కర్రెమ్మ పండగ కోటా మైసమ్మ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు నవంబర్ 1 గ్రామ పోలీచల్లే కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు గ్రామస్తులు యువకులు నాయకులు పాల్గొని వేడుకలను విజయవంతం కోరారు.

గ్రామీణులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించాలి

- ఆర్థిక అక్షరాస్యతతోనే ప్రభుత్వ

పథకాలు ప్రజలకు చేరువ

- సిద్దిపేట ఐటీ టవర్‌లో ఆర్‌బీఐ

ఆధ్వర్యంలో అవగాహన ప్రోగ్రాం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ /
అక్టోబర్ 29 (నమస్తే హైదరాబాద్):
గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించి, అర్హులైన ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, బీమా, పెన్షన్, రుణ సదుపాయాలు అందేలా కృషి చేయాలని బ్యాంకు అధికారులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులకు సూచించారు. గురువారం సిద్దిపేటలోని ఐటీ టవర్‌లో భారతీయ రిజర్వు బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక సమ్మిళితత్వం, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ప్రోగ్రాం నిర్వహించారు. జిల్లాలోని 55 గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వివిధ బ్యాంకుల ప్రాంతీయ అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి భారతీయ రిజర్వు బ్యాంకు జనరల్ మేనేజర్ ఎంజి సుప్రభాత్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు యశ్వంత్ సాయి, కిరణ్, సిద్దిపేట లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ బి హరిబాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ ఎంజి సుప్రభాత్

మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగ నియంత్రణలు, ప్రజలకు అందుబాటులో ఉన్న సేవలు, వినియోగదారుల హక్కులు, సురక్షితమైన బ్యాంకింగ్ విధానాలపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేయడంలో గ్రామ పంచాయతీ ప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ బి హరిబాబు మాట్లాడుతూ లీడ్ బ్యాంకు పథకం లక్ష్యాలు, ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు, బ్యాంకు ఖాతాలు, బీమా, పెన్షన్, రుణ సదుపాయాలపై వివరించారు. అర్హులైన లబ్ధిదారులకు ఆయా పథకాల ప్రయోజనాలు అందేలా బ్యాంకు అధికారులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ వ్యవసాయం, అనుబంధ రంగాలు, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన సబ్సిడీ పథకాలు, రుణ సదుపాయాల గురించి వివరించారు. వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి పథకం ద్వారా గిడ్డంగులు, శీతల గిడ్డంగులు, పంటల నిల్వ కేంద్రాలు, ప్రాథమిక శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు అర్హులైన రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, వ్యవసాయ పారిశ్రామికవేత్తలు పొందగలిగే రుణాలు, వడ్డీ రాయితీ, పథకం నిబంధనలను వివరించారు. గ్రామస్థాయిలో ఆర్థిక అక్షరాస్యతను పెంచడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, అర్హులైన ప్రజలను బ్యాంకింగ్ సేవలతో అనుసంధానించడం, గ్రామీణ ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

వట్టెం నవోదయాలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు

బిజినేపల్లి 29 మండల పరిధిలోని వట్టెంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2027-28 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశాల కోసం జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష నవంబర్ 8న నిర్వహించునున్నారు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు అధికారిక వెబ్ సైట్ద్వారా హాల్ టికెట్ లోని పరీక్ష కేంద్రం సమయాన్ని ముందుగానే పరిశీలించాలి

మృతుల కుటుంబాలకు కంటారెడ్డి తిరుపతి రెడ్డి గారు ఆర్థిక సాయం

మెదక్ జిల్లా బ్యూరో 29 అక్టోబర్ అప్పులబాదతో మృతి చెందిన కాశమైన నర్సింలు,చిమ్మనమైన నాగరాజు కుటుంబాలకు రూ.5 వేల సహాయం. ఈ విషయాన్ని స్థానిక నాయకులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు.నర్సింలు, నాగరాజు మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన కంఠారెడ్డి తిరుపతి రెడ్డి బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా ఆర్థిక సాయం అందజేశారు. ఆయన సూచనల మేరకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5 వేల నగదును అందజేశారు.

తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులుగా డి.ఎస్. జగన్ బాధ్యతల స్వీకరణ

డీఎస్ జగన్ గారికి శుభాకాంక్షలు తెలిపిన నమస్తే మహాప్రభ ఛైర్మన్ నక్క రాజు

ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో Xధూ= శాఖ పాత్ర కీలకం.

డి.ఎస్. జగన్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష.

హైదరాబాద్ - అక్టోబర్ 29 (నమస్తే హైదరాబాద్):
తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులుగా డి.ఎస్. జగన్ నూతన బాధ్యతలు స్వీకరించా

రు ఈ సందర్భంగా డిఎస్ జగన్ గారినీ నమస్తే మహాప్రభ దిన పత్రిక ఛైర్మన్ నక్క రాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో సమాచార, పౌర సంబంధాల శాఖ కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. డి.ఎస్. జగన్ తన నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రజని వాయిస్ బడే సాబ్,సమాచార యోగి పాలోజు కృష్ణమాచారి, మహాప్రభ రాయరపు మహేష్,శివతో పాటు నమస్తే మహాప్రభ దినపత్రిక ప్రతినిధులు,రిపోర్టర్లు అభినందనలు తెలిపారు.

మీ గళం.. మా కలం..!
నమస్తే హైదరాబాద్
NAMASTHE HYDERABAD తెలుగు దిన పత్రిక RNI No: APTEL/2012/45237

ఓటు బచావో దేశ్ బచావో

కార్యక్రమానికి తరలిన కాంగ్రెస్ నాయకులు

మెదక్ జిల్లా బ్యూరో అక్టోబర్ 29
ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న 'ఓటు బచావో..దేశ్ బచావో' కార్యక్రమంలో పాల్గొనేందుకు నిజాంపేట మండల కేంద్రం నుంచి గురువారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా నిర్వహిస్తున్న 'ఓటు బచావో.. దేశ్ బచావో' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆదేశాల మేరకు ఢిల్లీకి తరలివెళ్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, మాజీ ఎంపీపీ సిద్ధరాములు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు భాను ప్రకాష్ రెడ్డి, బొమ్మన మల్లేశం, రామ్ చందర్ నాయక్, బాబు నాయక్, నసీరుద్దీన్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోల్ ప్లే పోటీలు

మెదక్ జిల్లా బ్యూరో అక్టోబర్ 29 జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి రోల్ ప్లే పోటీ లు నిర్వహించారు. చైల్డ్ రైట్స్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ లో భాగంగా తొమ్మిదవ తరగతి విద్యార్థులకు ఈ పోటీ నిర్వహించారు జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో విద్యార్థులు విలువలు, ఆరోగ్యం సమానత ,భద్రత వంటి అంశాలపై రోల్ ప్లే చేసి అందరినీ ఆకట్టుకున్నారు ఈ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజ్ పల్లి విద్యార్థులు ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యారు. రెండవ స్థానం హవేలీ ఘనపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పొందగా మూడవ స్థానం కేజీబీవీ కొల్చారం విద్యార్థులు సాధించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విజేతలకు జిల్లా విద్యాశాఖాధికారి రాజు మెమెంటోలు ప్రశంస పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్నిట్లో ముందు ఉండాలని, రాష్ట్రస్థాయి రోల్ ప్లే పోటీల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన మూర్తి న్యాయ నిర్ణేతలు రామేశ్వర ప్రసాద్ , అంజాగౌడ్ ,స్టెలా ,వంశీకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులూ.. విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దు..

- చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి..
- విద్య, నైపుణ్యాలపై దృష్టి సారించాలి..
- మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు..
- తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి..
- సీపీ సాధన రష్మీ పెరుమాళ్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / అక్టోబర్ 29 (నమస్తే హైదరాబాద్):
విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా విద్యపై దృష్టి సారించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తమ నైపుణ్యాలను పెంపొందించు కోవాలని సిద్దిపేట పోలీస్

కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ సూచించారు. గురువారం గజ్వేల్‌లోని మహతి ఆడిటోరియంలో నిర్వహించిన షీ టీమ్ అవగాహన ప్రోగ్రాంలో ఆమె పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల్లో నేరప్రవృత్తిని నివారించడం, రహదారి భద్రత, మహిళల రక్షణ, అంతర్జాల మోసాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇటీవల నిర్వహించిన నేర సమీక్షలో మైనర్లు నేరాలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమకు లభిస్తున్న విద్యావకాశాలను, స్వేచ్ఛను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వడం ప్రమాదకరం
మైనర్లు వాహనాలు నడపడం, ముగ్గురు కలిసి ద్విచక్రవాహనంపై ప్రయాణించడం ప్రమాదకరమని సీపీ హెచ్చరించారు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలు 12, 13 ఏళ్ల వయసులోనే వాహనాలు నడుపుతూ బయటకు వెళ్తున్నారని గర్వంగా భావిస్తున్నారని, అయితే ప్రమాదాలు జరిగినప్పుడు వాటి పరిణామాలు తీవ్రంగా ఉంటాయని వివరించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు ఈ వయసులో చదువుపై దృష్టి సారించి, కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటూ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని హితవు పలికారు.

ప్రతి నిమిషం ఎంతో విలువైనది
తాత్కాలిక ఆకర్షణలకు లోనై చెడు మార్గాల్లోకి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని సీపీ సూచించారు. "ఈ సమయాన్ని వృథా చేసుకోకండి.. ఈ సమయం మళ్లీ తిరిగి రాదు".. అని పేర్కొంటూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ప్రతి నిమిషం ఎంత విలువైనదో తెలుసని, విద్యార్థులు కూడా సమయ ప్రాధాన్యతను గుర్తించాలని తెలిపారు. కోరుకున్న వస్తువులు లేదా మొబైల్ ఫోన్ కొనివ్వలేదనే కారణంతో కొందరు విద్యార్థులు తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే మానసిక బలాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సమస్యలను మనసులో దాచుకోకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన వ్యక్తులతో పంచుకోవాలని తెలిపారు. తన విద్యార్థి జీవితంలో ఎదురైన అనుభవాలను, ఉపాధ్యాయులు అందించిన ప్రేరణను గుర్తుచేస్తూ, గురువుల మార్గదర్శకత్వం విద్యార్థుల జీవితాల్లో సానుకూల మార్పులకు దోహద పడుతుందని పేర్కొన్నారు.

మహిళల పట్ల గౌరవభావంతో వ్యవహరించాలి
మహిళల భద్రతకు సంబంధించిన కార్యక్రమాలు కేవలం మహిళలకే పరిమితం కావని, పురుషులు కూడా వాటిపై అవగాహన కలిగి ఉండాలని సీపీ స్పష్టం చేశారు. మహిళల పట్ల గౌరవంతో వ్యవహరిస్తూ, లింగ వివక్షకు తావులేకుండా సమానత్వాన్ని పాటించాలని సూచించారు. మహిళలకు భద్రతతో కూడిన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా చేపడుతున్న 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమం ఉద్దేశాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకొని, మహిళల రక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అంతర్జాల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
విద్యార్థులు అంతర్జాల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. గుర్తు తెలియని లింకులను తెరవడం, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతాల సమాచారం, ఒకసారి వినియోగించే రహస్య సంఖ్యలను ఇతరులతో పంచుకోవడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీయడమే కాకుండా ఆరోగ్యం, కుటుంబాలు, సామాజిక జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. వాటికి అలవాటుపడిన వారికి తగిన చికిత్స, కౌన్సెలింగ్ అందించడం ద్వారా సాధారణ జీవితంలోకి తిరిగి వచ్చేలా సహాయం చేయవచ్చని పేర్కొన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు లేదా వాటికి సంబంధించిన కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ కోణం నర్సింహులు, గజ్వేల్ ఎస్‌హెచ్‌ఓ రవికుమార్, సీఐలు రవి రాజు, లతీఫ్, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ దుర్గ, సుజాత డిగ్రీ కళాశాల లెక్చరర్, శ్వేత మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు, షీ టీమ్ సభ్యులు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పోస్కో చట్టం పై అవగాహన

మెదక్ జిల్లా అక్టోబర్ 29 తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నేడు అనగా తేదీ: 29-10-2026 రోజున మెదక్ పట్టణంలోని సెయింట్ డాన్ బాస్కో ఉన్నత పాఠశాల, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అప్ గ్రేడెడ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (బాలికల), ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మినీ గురుకులం పాఠశాలల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత్ బచ్పన్ అభియాన్ - ఏ పాన్ ఇండియా స్కూల్ అవేర్నెస్ కాంపెయిన్ లో భాగంగా "పూజూూబాజు, 2012" అనే అంశంపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ శ్రీమతి రుబీనా ఫాతిమా గారు మాట్లాడుతూ పోక్సో చట్టం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, పిల్లలను లైంగిక వేధింపులు,దాడులు మరియు దోపిడీ నుంచి రక్షించడం ఈ చట్టం ముఖ్య ఉద్దేశం అన్నారు. గుడ్ టచ్--బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు చిన్న వయస్సు నుంచే అవగాహన కల్పించాలని, ఎవరైనా అనుచితంగా తాకినా లేదా అసౌకర్యానికి గురిచేసినా వెంటనే పెద్దలకు చెప్పాలన్నారు. సైబర్ నేరాలు నేటి సమాజంలో ఒక ముఖ్యమైన సమస్యగా మారుతున్నాయని, మొబైల్ ఫోన్లు,సోషల్ మీడియాఉపయోగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితులకు వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంపకూడదన్నారు. ఆన్‌లైన్ వేధింపులు, బెదిరింపులు లేదా మోసాలు ఎదురైతే ఆధారాలను భద్రపరిచి పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమాలలో ఆర్సిఓ గంగారాం గారు, మెదక్ మండల విద్యాధికారి శ్రీ శంకర్ గారు, ప్యానల్ న్యాయవాదులు శ్రీ కేఎల్ఎన్. దత్ గారు, శ్రీ బి. ప్రశాంత్ గారు, ఎస్ఐ మాణిక్ ప్రభు గారు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీ ప్రమోద్ జాన్ గారు, శ్రీమతి కళ్యాణి గారు, శ్రీమతి దీక్ష గారు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సాగర్ కట్ట సమీపంలో అక్రమ బ్లాస్టింగ్స్

కట్ట భద్రతకు ముప్పు.. తక్షణమే పనులు నిలిపివేయాలి
మాజీ మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / అక్టోబర్ 29 (నమస్తే హైదరాబాద్):
మల్లన్న సాగర్ రిజర్వాయర్ కట్ట సమీపంలో అనుమతులు లేకుండా భారీ బ్లాస్టింగ్స్ చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తిప్పారం గ్రామస్తుల ఫిర్యాదుతో మల్లన్న సాగర్ కట్టను, బ్లాస్టింగ్స్ జరుగుతున్న ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ కట్టకు కేవలం 150 మీటర్ల దూరంలోనే భారీ పేలుళ్లు జరుపుతున్నారని, వాటి ప్రభావంతో తిప్పారం గ్రామంలోని ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని తెలిపారు. బ్లాస్టింగ్స్ కారణంగా కట్టకు నష్టం జరిగి, నీటి లీకేజీ పెరుగుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇరిగేషన్

అధికారులు పనులు నిలిపివేయాలని లేఖ రాసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మల్లన్న సాగర్ భద్రతపై ప్రభుత్వం వెంటనే స్పందించి బ్లాస్టింగ్స్‌ను నిలిపివేయాలని, నిపుణులతో కట్టను పరిశీలించాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా బ్లాస్టింగ్స్ చేసిన వారిపై కేసులు నమోదు చేసి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పేలుళ్లతో దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. భూసేకరణలో దళిత అసైన్డ్ రైతులకు అన్యాయం జరిగిందని హరీశ్ రావు ఆరోపించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పట్టా, అసైన్డ్ రైతులకు తగిన పరిహారం అందించాలని, ఎకరాకు కనీసం రూ.20 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, తిప్పారం గ్రామస్తులు పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు హాజరు కాని ఎమ్మెల్యే బీజేపీ నాయకులకు క్షమాపణ చెప్పాలి

రైతులకు నీళ్లు ఇచ్చేదాకా ఎమ్మెల్యేను నిలదీస్తాం..
బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు చింత సృజన్ కుమార్

జనగాం జిల్లా దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్)
దేవరుప్పుల మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు చింత సృజన్ కుమార్ సందర్భంగా మాటా ్లడుతూ. సోమవారం దేవాదుల ప్రాజెక్టు నీళ్ల కోసం మేము శాంతి యువ ధర్నా చేస్తే కాంగ్రెస్ నాయకులు లేగ రామ్మోహన్ రెడ్డి మీద అనవసర ఆరోపణలు చేయడం జరిగింది.దానికి పత్రిక విలేకరుల సమావేశం మేము నిర్వహించి గురువారం 11 గంటలకు మీ దగ్గర ఎలాంటి ఆధారాలు ఉన్న మీ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డినీ తీసుకొని బహిరంగ చర్చకు పాలకుర్తి నియోజకవర్గంలో ఉన్న శివాలయం వద్దకురావాలి అని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో. సవాలు విసరడం

జరిగింది. రాత్రి 12 గంటలకు పాలకుర్తి నియోజకవర్గంలో ఉన్న బీజేపీ నాయకులు కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్ట్ లు ఎన్ని చేసిన మా నాయకుడు లేగ రామ్మోహన్ రెడ్డి మరియు కార్యకర్తలు ఉదయం 11 గంటలకు శివాలయం దేవాలయంకి చేరడం జరిగింది. కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి చర్చకు రాకపోగా శివాలయం లో ఉన్న మమ్మల్ని అందరినీ పోలీసులు అరెస్ట్ చేసి పాలకుర్తి పోలీసు స్టేషన్ కి తరలించడం జరిగింది.అక్కడ నుండి దేవరుప్పుల పోలీసు స్టేషన్ కి తీసుక రావడం జరిగింది దీనికి అనవసరంగా ఆధారం లేని ఆరోపణలు చేసినందుకు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలి.ఇక ముందు ఇలాంటి ఆరోపణలు చేస్తే తగు మూల్యం చెల్లించక తప్పదు మీరు ఎన్ని నిర్బంధలు చేసినా మీరు రైతులకు నీళ్లు ఇచ్చేదాకా ఎమ్మెల్యే ను వదిలి పెట్టం అని అన్నారు, ఈ కార్యక్రమంలో,బీజేపీ పాలకుర్తి ఇంచార్జ్ లేగ రామ్మోహన్ రెడ్డి, బీజేపీ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగాల నవీన్ రెడ్డి, బీజేపీ జనగామ ,జిల్లా కార్యదర్శి దుంపల సంపత్, బీజేపీ మండల అధ్యక్షులు బస్వ భాస్కర్, కాసాని సత్తయ్య భాషిపాక సుధాకర్,బస్వ మహేశ్, ఉప్పునూతల నాగరాజు గౌడ్, భాషిపాక కొండయ్య, రామగిరి గణేష్, మూడ అన్వేష్. తదితరులు, పాల్గొన్నారు,

పెళ్లి వేడుకలో శుభాకాంక్షలు..

బాధిత కుటుంబాలకు పరామర్శ జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పర్యటన

జగిత్యాల, అక్టోబర్ 29: జగిత్యాల మండలంలోని వంజరుపల్లి గ్రామంలో పుల్ల మల్లయ్య కుమారుడి వివాహ వేడుకకు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన మోతుకు దశరథం (తండ్రి మీనయ్య), మోతుకు రాజం మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెల్దుర్తి గ్రామానికి చెందిన ఉంగరాల లక్ష్మరాజం తల్లి ఉంగరాల అమతమ్మ మతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సదాశివ రావు, సర్పంచులు గంగ మల్లయ్య, ప్రకాష్, ఉపసర్పంచులు శేఖర్, హరీష్, మాజీ ఎంపీటీసీలు కూడుకల లక్ష్మణ్, శంకర్, మాజీ సర్పంచులు నరేష్, మల్లారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు శ్రీకాంత్, మహేష్ గౌడ్, వార్డు సభ్యులు, చేదల తిరుపతి, గంగాధర్, పడిగెల శ్రీనివాస్, లక్ష్మరాజం, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్న కు లేఖ...

ఎమ్మెల్యే హామీపై మొర...
నారాయణపూర్ ముంపు గ్రామ ప్రకటనపై గ్రామస్థుడి వేడుకోలు



జగిత్యాల: కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి హుండీలో భక్తుడి కానుకల మధ్య ఓ లేఖ బయటపడటం ఆసక్తికరంగా మారింది. దేవుడికి మొక్కులు చెల్లించుకోవడమే కాదు.. ప్రజాప్రతినిధి ఇచ్చిన హామీ నెరవేరాలని స్వామివారినే వేడుకుంటూ రాసిన ఈ లేఖ ఇప్పుడు చర్చనీయాంశమైంది.కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని కోరుతూ గ్రామానికి చెందిన వ్యక్తి ఈ లేఖ రాసినట్లు తెలుస్తోంది. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తమ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చేలా చూడాలని అందులో విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.

ప్రజాప్రతినిధి హామీపై అంజన్నకే మొర!

తమ గ్రామంపై ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఉండాలని, ఎమ్మెల్యే ఇచ్చిన మాట కార్యరూపం దాల్చాలని కోరుతూ లేఖను హుండీలో వేసినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధుల హామీలు నెరవేరాలని భక్తుడు స్వామివారిని వేడుకోవడం పలువురి దృష్టిని ఆకర్షిస్తోంది.సాధారణంగా హుండీలో నగదు, బంగారం, వెండి కానుకలు కనిపిస్తుంటాయి. కానీ ప్రజా సమస్యకు పరిష్కారం కోరుతూ, ఇచ్చిన హామీని గుర్తుచేస్తూ వచ్చిన ఈ లేఖ ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది. నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలన్న డిమాండ్‌పై సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తొలగింపు కోసం పాదయాత్ర చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్ని కలిసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు సొప్పరి క్రాంతి,గుత్తుల తరుణ్.

హైదరాబాద్,
జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తొలగించాలని మహాపాదయాత్ర నిర్వహిస్తున్న మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు పేదల పెన్నిధి ఈటల రాజేందర్ అన్నను మర్యాదపూర్వకంగా కలిసి జన సంకల్ప యాత్ర లో భాగంగా ఈ రోజున వారి పాదయాత్రలో మేము కూడా భాగసామ్యూలం అవడం జరిగినది ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ జిల్లా నాయకులు సోప్పరి క్రాంతి , గౌతమ్ పూర్ వార్డు మెంబర్ గుత్తుల తరుణ్, సాయి తేజ తదితరులు పాల్గొనడం జరిగింది.

గోరువెచ్చని నీటిలో తేనె, నిమ్మరసం కలిపి తాగుతున్నారా.. !!

మారుతున్న కాలంలో ఆరోగ్య పరమైన జాగ్రత్తలు పెరుగుతున్నాయి. గోరెవెచ్చని నిటిలో తేనె, నిమ్మరసం ఆరోగ్యపరమైన వినియోగం. ఇలా తీసుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. ప్రతీ రోజు ఉదయం పరగడపున ఇలా తాగటం వలన మెటబాలిజం పెరిగి కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. అలాగే ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి. నిమ్మరసంలో ఎన్నో పోషకాలు ఉంటాయి. అందుకే చాలా మంది ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో దీనిని తాగడానికి ఇష్టపడతారు. దీని ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. కాగా.. ఇలా తీసుకోవటం పైన నిపుణులు కీలక సూచనలు చేస్తున్నారు.ఈ మధ్య కాలంలో చాలా మంది పరగడపున ఇలా తేనె, నిమ్మరసం కలిపిన నీరు తీసుకోవటం అలవాటుగా మార్చుకున్నారు. దీని వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. బరువును తగ్గించడం కోసం ఈ నీళ్లు ఎంతగానో పనిచేస్తాయి. అయితే కొందరు ఈ నీటిలో తేనెకు బదులుగా చక్కెర కలిపి తాగుతుంటారు. బరువు తగ్గాలని చూస్తున్నవారు ఎట్టి పరిస్థితిలోనూ నిమ్మకాయ నీళ్లలో చక్కెర కలపకూడదు. ఉప్పును కూడా కలపకూడదు. ఎండవల్ల మీ శరీరం డీహైడ్రేషన్ బారిన పడితేనే అలాంటి సందర్భంలోనే నిమ్మకాయ నీళ్లలో ఉప్పు, చక్కెర కలిపి తాగాలి. రోజుకు 1 లేదా 2 సార్లు తాగాలని మాత్రమే నియమం పెట్టుకోవాలి. అన్నే సార్లు తాగాలి. లేదంటే శరీరంపై నెగెటివ్ ప్రభావం పడుతుంది. నిమ్మకాయ నీళ్లను తయారు చేసేందుకు ఉపయోగించే నీళ్లు చాలా శుభ్రంగా ఉండాలి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతుంది. నిమ్మకాయ నీరు తాగడం ద్వారా శరీర హైడ్రేషన్ బాగా ఉంటుంది.కాగా, ఈ జ్యూస్ ను పరగడుపున తాగడం వల్ల కడుపులో యాసిడ్ ఉత్పత్తి ప్రేరేపించబడటంతో రోజంతా తీసుకునే ఆహారాన్ని జీర్ణ చేయడంలో సహాయపడుతుంది. ఇలా రోజు ఈ జ్యూస్ తీసుకోవటం వలన రోగనిరోధక శక్తి పెరుగుతుంది. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. నిమ్మకాయ ఆరోగ్యానికి ఉపయోగపడుతుందని చెప్పి కొందరు నేరుగా నిమ్మరసాన్ని సేవిస్తర్తీ ఉంటారు. ఇలా చేయటం సరైన విధానం కాదు. నిమ్మకాయ రసంలో ఆమ్ల గుణాలు ఉంటాయి. ఇవి దంతాలకు నేరుగా తాకితే దంతాలపై ఉండే ఎనామిల్ పొర కరిగిపోతుంది. దీంతో దంతాలు బలహీనంగా మారుతాయి. గ్యాస్ ట్రబుల్ సమస్య ఉన్నవారు ఈ నీళ్లను ఎట్టి పరిస్థితిలోనూ పరగడుపున సేవించకూడదు. ఈ నీళ్లను తాగాలని భావిస్తే ఉదయం అల్పాహారం చేసిన తరువాత 40 నిమిషాలు ఆగి ఆ తరువాత తాగవచ్చు. ప్రతీ రోజు నిర్దేశించిన సమయంలో పరిమితి మేరకు ఈ నీరు తాగటం ద్వారా ఆరోగ్య పరంగా ప్రయోజనాలు పొందే అవకాశం

చలికాలంలో వద్ధులకు చేయూత..

లక్ష్మీ గజేందర్ సేవాభావం!
శివ గాయత్రి అనాథ వద్ధాశ్రమంలో వద్ధులకు స్వేటర్లు పంపిణీ..

జగిత్యాల, అక్టోబర్ 29: చలికాలంలో వద్దులు చలిబారిన పడకుండా వారికి అండగా నిలవాలనే సేవాభావంతో గూడూరి లక్ష్మీ గజేందర్ ముందుకొచ్చారు. జగిత్యాల జిల్లా జాబితాపూర్ గ్రామానికి చెందిన ఆమె ప్రస్తుతం జగిత్యాల పట్టణంలోని గోవిందపల్లిలో ఉన్న బందావన్ అపార్ట్మెంట్లో నివాసం ఉంటున్నారు.జగిత్యాల రాజేశుని గుట్టలోని శివ గాయత్రి అనాథ వద్ధాశ్రమంలో ముగ్గురు మహిళలు, ఐదుగురు పురుషులకు స్వేటర్లు అవసరమని తెలుసుకున్న లక్ష్మీ గజేందర్ గురువారం

వాటిని తీసుకొచ్చి ఎనిమిది మంది వద్దులకు అందజేశారు. అంతేకాకుండా ఆశ్రమంలోని వద్దులకు భోజన సదుపాయం కూడా కల్పించి తన మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ఆశ్రమ అధ్యక్షుడు రాజేశుని శ్రీనివాస్ మాట్లాడుతూ అనాథలుగా ఉన్న వద్దులకు తమ ఆశ్రమం ఆశ్రయం కల్పిస్తుందని తెలిపారు. ఆదరణకు నోచుకోని వద్దులు ఎవరైనా ఉంటే ఆశ్రమంలో చేర్చుకుంటామని పేర్కొన్నారు.వేడుకలను వద్దుల మధ్య జరుపుకోవాలిజన్మదినాలు, వివాహ వార్షికోత్సవాలు, పెద్దల జయంతి, వర్ధంతి వంటి ప్రత్యేక సందర్భాలను ఆశ్రమంలోని వద్దుల మధ్య జరుపుకోవాలని శ్రీనివాస్ సూచించారు. ఇలాంటి సందర్భాల్లో వద్దులకు భోజన సదుపాయం కల్పించడం ద్వారా మన పెద్దల సమక్షంలో వేడుకలు జరుపుకున్న అనుభూతి కలుగుతుందని అన్నారు. సమాజంలో సేవాభావం కలిగిన వారు ముందుకొచ్చి వద్దులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రధాన కార్యదర్శి రంగు రాజయ్య, ఆశ్రమ మేనేజర్ మోటూరి నాగలింగం పాల్గొన్నారు.

భార్య నౌకరి.. భర్త పెత్తనం..!

పంచాయతీ నుంచి స్కూళ్లకు సోకిన రోగం
కల్లెడ సర్కార్ బడిలో నిర్వాకం
ఇబ్బందుల్లో టీచర్లు

జగిత్యాల, అక్టోబర్ 29: ప్రభుత్వ ఉద్యోగులు తమ విధుల్లో కుటింబికుల జోక్యాన్ని నివారిస్తూ ప్రభుత్వ నిబంధనలున్నా కల్లెడ ప్రభుత్వ పాఠశాలలో భేఖాతారవుతున్న సంఘటన ఇది. జగిత్యాల జిల్లాలోని కల్లెడ గ్రామములోని ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా లో మహిళ పని చేస్తోంది. ప్రతి రోజు కరీంనగర్ నుంచి పాఠశాలకు వచ్చే సదరు ప్రధానోపాధ్యాయురాలితోపాటు ఆమె భర్త కూడా కారులో బడికి ప్రతి రోజు వస్తాడని తెలిసింది. డ్రైవర్ గా వస్తున్న హెచ్. ఎం. భర్త అక్కడికే పరిమితం కాకుండా టీచర్ల విధుల్లో జోక్యం చేసుకొంటున్నట్లు తెలిసింది. ఇక్కడితో ఆగకుండా టీచర్ల భోధనాతీరును ప్రశ్నిస్తూ ఇబ్బందులకు గురిచేస్తూన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనికితోడు వివిధ స్కూల్ పనుల్లో టీచర్లను ప్రశ్నించాల్సిన ప్రధానోపాధ్యాయురాలి స్థానంలో ఆమె భర్త టీచర్లను నిలదిస్తూ ఇబ్బందులకు గురిచేస్తూన్నట్లు తెలిసింది. హెచ్. ఎం. ఆఫీసులో ఎప్పుడు ఉంటుండడముతో మహిళా టీచర్లు ఆఫీస్ రూమ్ లోకి వెళ్లేందుకు ఇబ్బందులకు

గురవుతున్నట్లు తెలిసింది. తన విధుల్లో భర్త జోక్యాన్ని నివారించాల్సిన ఆ ప్రధానోపాధ్యాయురాలు తన భర్త కు పరోక్ష మద్దతూ ఇస్తూన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు అ స్కూల్లోనే హెచ్ ఎం భర్త స్కూల్ కాంపౌండ్లోనే ఉంటుండడంతో అక్కడి మహిళా ఉపాధ్యాయినిలు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిసింది. ఇక్కడి బడిలో విధుల్లో చేరిన నాటి నుంచి సదరు ప్రధానోపాధ్యాయురాలి మూలంగా టీచర్లు, పేరెంట్స్ నేటి వరకు ఇబ్బందులను ఎదుర్కొంటూనే తమ విధులను పూర్తి చేస్తున్నట్లు తెలిసింది. ఎవరికైనా హెచ్. ఎం. భర్త పెత్తనం పై ఫిర్యాదు చేస్తే ఎక్కడ మరిన్ని వేధింపులుంటాయనే ఆవేదనలో అక్కడి టీచర్లు చేరుకొన్నట్లు తెలిసింది. గత ఎస్సీస్సి పరీక్షల సమయంలోను రాయికల్ పరీక్షా కేంద్రంలో పర్యవేక్షణ అధికారిగా విధులు నిర్వహించిన సమయంలోనూ పోలీస్ స్టేషన్ నుంచి ప్రశ్న పత్రాలను తీసుకెళ్లే విధుల్లోను సదరు హెచ్. ఎం భర్త పూర్తి స్థాయిలో విధులు నిర్వహించినట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే ఇదే పాట శాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు డిప్యూటేషన్ పంపిస్తే సాధారణంగా మరో ఇద్దరు ఈ పాఠశాలలో విధుల్లో చేరితేనే ఇక్కడి ఇద్దరినీ రిలీవ్ చేస్తారన్నట్లు సమాచారం. కానీ ఇక్కడికి ఇద్దరు రాకుండానే ఉన్నోళ్లను రిలీవ్ చేయడంపై స్థానికంగా విమర్శలు పెరిగాయి. ఏది ఏమైనా సదరు ప్రధానోపాధ్యాయురాలి వ్యవహార తీరుపై స్థానికంగా వ్యతిరేకత పెరుగుతుండగా మరో వైపు భర్త పెత్తనం అనే అంశంలో పంచాయతీ లకే పరిమితమైన భర్త పెత్తనం అనే అంశం జగిత్యాల వ్యాప్తంగా చర్చల్లోకి చేరింది. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాదికారి, సంబంధిత ఉన్నతాధికారులు ఈ అంశంపై స్పందించాలని కల్లెడ ప్రజలు కోరుతున్నారు.

లాస్య మృతిపై సమగ్ర విచారణ జరపాలి

- **శాంతియుత ధర్నాపై పోలీసుల దాడి..**

అక్రమ అరెస్టులు దుర్మార్గం..
యుఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ డిమాండ్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ /
అక్టోబర్ 29 (నమస్తే హైదరాబాద్):
సిద్దిపేట నియోజకవర్గం రాఘవపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని లాస్య అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత ఐక్య విద్యార్థి సమాఖ్య (యుఎస్ఎఫ్ఐ) సిద్దిపేట జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. లాస్య మృతికి గల కారణాలను నిగ్గు తేల్చి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ గురువారం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ వద్ద ఇతర విద్యార్థి సంఘాలతో కలిసి శాంతి యుతంగా ధర్నా నిర్వహిస్తుండగా పోలీసులు అప్రజాస్వా మికంగా వ్యవహరించి నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని సంఘం నాయకులు ఆరోపించారు. అరెస్టు చేసే క్రమంలో పోలీసులు విచక్షణారహితంగా దాడి చేయడంతో నాయకుల చేతులకు తీవ్ర గాయాలయ్యాయని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును అణచివేయడం దుర్మార్గమని విమర్శించారు.

యుఎస్ఎఫ్ఐ ప్రధాన డిమాండ్లు ఇవే..
లాస్య మృతి ఘటనపై తక్షణమే ఉన్నతస్థాయి విచారణ జరిపి, ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలితే సంబంధిత పాఠశాల అధికారులను సస్పెండ్ చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే పరిహారం ప్రకటించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అన్ని విధాలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థినుల భద్రతపై కఠిన పర్యవేక్షణ చేపట్టి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం
లాస్య మృతి ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని యుఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించింది. ఈ ఆందోళన కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పలువురు బిఆర్ఎస్ నాయకులతో పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

టోల్గేట్ వద్ద ప్రమాదం తప్పిన ప్రాణ నష్టం

హుస్నాబాద్:హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న టోల్‌గేట్ సమీపంలో బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు గుంతలమయంగా ఉండటంతో అటుగా వెళ్తున్న స్విఫ్ట్ కారు ప్రమాదానికి గురైంది. కారులో ప్రయాణిస్తున్న దంపతులకు స్వల్ప గాయాలు కాగా, ప్రాణాపాయం తప్పింది. కారు తీవ్రంగా దెబ్బతింది.టోల్‌గేట్ నిర్మాణ పనులు పూర్తికాకపోవడం, రోడ్డుపై గుంతలు ఉండటం, హెచ్చరిక బోర్డులు సరిగా ఏర్పాటు చేయకపోవడం ప్రమాదాలకు కారణమవుతున్నాయని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, నిర్మాణ పనుల వద్ద భద్రతా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వరి పంటలో కత్తెర పురుగు ఉద్రుతది



హుస్నాబాద్: మండలంలోని మహమ్మదాపూర్ గ్రామంలో వరి పంటను కత్తెర పురుగు ఆశించినట్లు మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజా, వ్యవసాయ విస్తరణ అధికారులు గుర్తించారు. గురువారం రైతులు స్వామి, పిట్టల బాలయ్య, కాసర్ల ఐలయ్య ల వరి పొలాలను సందర్శించి పంట పరిస్థితిని పరిశీలించారు. కత్తెర పురుగు రాత్రివేళల్లో వరి మొక్కల కాండాలను నేలమట్టానికి దగ్గరగా కత్తిరించి నష్టం కలిగిస్తుందని తెలిపారు. రైతులు సాయంత్రం, రాత్రి వేళల్లో పొలాలను పరిశీలించి పురుగులను ఏరివేసి నాశనం చేయాలని, పొలం గట్లపై గడ్డి, కలుపు మొక్కలను తొలగించాలని సూచించారు. పురుగు ఉధృతిని బట్టి వ్యవసాయ అధికారుల సలహా మేరకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

జర్మనీలో ఉద్యోగమని చెప్పి ఓ యువకుడి చేతికి కత్తి ఇచ్చారు.. కాంగ్రెస్ సర్కార్ మరో స్కాంపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్:: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న టామ్ కామ్ స్కామ్ ను బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బయటపెట్టారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ టామ్‌కామ్ గురించి టామ్‌టామ్ చేస్తూ రోజూ మంత్రి వివేక్ వెంకటస్వామి తిరుగుతున్నారు. ఆయన దక్షిణ కొరియా పోతున్నారు.. జపాన్ పోయారు.. మొన్ననే జర్మనీ కూడా పోయొచ్చారు.. మరి జర్మనీకి వాళ్ల ఫ్రీగా అయితే పోరు.. ప్రభుత్వ ఖర్చుతో ప్రజల కష్టార్జితంతో మంత్రి, ఆయనతోపాటు కొంతమంది అధికారులు వైట్ పాస్‌పోర్టుతో ప్రభుత్వ ఖర్చుతో వీళ్లు విదేశాలకు పోయి వస్తారు.. దీనికి కోట్ల రూపాయలు ఖర్చై ఉంటయన్నారు.ఈ టామ్ కామ్ సంగతేంటి.. వీళ్లకు జరిగిన బాధేందనేది తెలంగాణ ప్రజల ముందర ఏకరువు పెట్టాల్సిన సమయం ఆస్నన్నమైంది..తెలంగాణలో నిరుద్యోగులు దాదాపు 40 లక్షల మంది ఉన్నారు.. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్ చూస్తూ మీకర్థమవుతుంది.

గ్రాడ్యుయేషన్ లేకున్నా కూడా ఉద్యోగాలకు అప్లై చేసుకున్న వాళ్లు 20 లక్షల వరకు ఉంది. ఏ ప్రభుత్వం కూడా అందరికీ అన్ని ఉద్యోగాలు కల్పించలేదు.ఒక ఉద్యోగం అని చెప్పి మరో ఉద్యోగం ఇప్పించి..ఇంజినీర్ ఉద్యోగాలని చెప్పి యువకులను జర్మనీకి పంపించి మటన్ షాపులో పని చేయిస్తున్నారు. పేరిట నిరుద్యోగుల నుంచి మంత్రి వివేక్ వెంకటస్వామి డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు విదేశాలకు పంపించాలనే ఉద్దేశంతో 2014లో ఝావీజూవీ ఏర్పాటు చేశారు. ఒక ఉద్యోగం అని చెప్పి మరో ఉద్యోగం ఇప్పించి బ్రోకర్లు అందరినీ మోసం చేస్తున్నారని, ఇవన్నీ జరగకూడదనే గత ప్రభుత్వం ఈ సంస్థను ఏర్పాటు చేసిందన్నారు. జర్మనీలో ఉద్యోగాలు, వాటికి కావాల్సిన నైపుణ్యాల గురించి ఝావీజూవీ ఇటీవల ప్రకటనలు ఇచ్చింది. ప్రకటనలు రాగానే వందలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఉచితంగా కల్పించాల్సిన అవకాశాల కోసం ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.4.10 లక్షలు వసూలు చేశారు. ఈ నిరుద్యోగులతో ఝావీజూవీ పేరు లేకుండా ఖీఋఅతీ క్షీతీవవ్ అనే సంస్థ పేరు మీద ఉన్న అగ్రిమెంట్లపై సంతకాలు చేయించారు. 200 మంది దగ్గర డబ్బులు వసూలు చేసి కనీసం 10 మందిని కూడా జర్మనీకి పంపించలేదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. ఒక నిరుద్యోగ యువకుడికి వెళ్లాకకట్ చేయాలని అతని చేతికి కత్తి ఇచ్చారుఅక్కడికి వెళ్లిన యువకులందరిదీ ఇదే పరిస్థితి. వివేక్ వెంకటస్వామి తన కొడుకు గడ్డం వంశీకృష్ణను కూడా ఇలాగే పంపిస్తాడా..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

బియ్యం బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు.. ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తాం

హైదరాబాద్, అక్టోబర్ 29: బియ్యం బ్లాక్ మార్కెట్ చేసేవారికి సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బియ్యం స్మగ్లింగ్ చేసేవారిపై బైండోవర్ కేసులు బుక్ చేస్తున్నామని తెలిపారు. (గురువారం) ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. ఎల్‌నినో నేపథ్యంలో బియ్యం ధరలు పెరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బియ్యం అక్రమ అమ్మకాలపై సమాచారంతో రైడ్స్ నిర్వహిస్తున్నామన్నారు. విజిలెన్స్ అధికారులతో కలిసి హైదరాబాద్‌తో పాటు వివిధ చోట్ల తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. రైస్ ఇల్లీగల్ బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.స్టాక్‌కు మించి బియ్యం నిల్వ చేస్తే కేసులు పెడతామని స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. రైస్ మిల్లర్స్, హోల్ సేలర్స్, రీటైలర్స్‌ను పిలిచి బియ్యం ధరలు తగ్గించాలని చెప్తున్నామని అన్నారు. ధరలు ఎందుకు పెరుగుతున్నాయన్న దానిపై స్టడీ చేస్తున్నామని.. బియ్యం ధరలు తగ్గించని వారిపై కేసులు తప్పవని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది అక్టోబర్ వరకు బియ్యం నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. 28 ఎల్ఎమ్‌టీ స్టాక్స్ ఉన్నాయని తెలిపారు. 25 కేజీలకు బదులు 23, 24 కేజీల రైస్ బ్యాగ్‌లను అమ్ముతున్నట్లు సమాచారం వచ్చిందని.. అలాంటి వారి ట్రేడ్ లైసెన్స్‌లను రద్దు చేస్తామని సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం.. చిన్నారులకు తీవ్ర గాయాలు

హైదరాబాద్, :
హైదరాబాద్ వనస్థలిపురంలోని ఆటోనగర్‌లో రోడ్డు ప్రమాదం జరిగింది. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోనగర్ హైకోర్టు కాలనీ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. హయత్‌నగర్ రంగనాయకుల గుట్టకు చెందిన వంశీ, వాణి దంపతులు ఇద్దరు పిల్లలతో బైకుపై ఎల్బీనగర్ వైపు ప్రయాణిస్తుండగా ఓ కారు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ప్రమాద ధాటికి ఇద్దరు చిన్నారులు గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడ్డారు.ఈ ఘటనలో చిన్నారులు మాన్విశ్ (2), యుగ్విశ్ (ఏడాదిన్నర)కు తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారుల తలకు గాయాలు, చెవుల నుంచి రక్తస్రావం అయినట్లు తెలుస్తోంది. బీటెక్ విద్యార్థి నితిన్ కారు నడుపుతున్నట్లు సమాచారం. కారులో నితిన్‌తో పాటు మరో ఇద్దరు స్నేహితులు ఉన్నట్లు తెలిసింది. సమాచారం అందగానే ఘటనాస్థలికి వనస్థలిపురం పోలీసులు చేరుకున్నారు. ఈ ప్రమాదంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై అధికారిక వివరాలు తెలియాల్సి ఉంది.

102 ఉద్యోగాలకు టీజీపీఎస్సీ నుంచి కొత్త నోటిఫికేషన్

హైదరాబాద్ :
తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఆర్థిక, గణాంక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 102 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది. వీటిలో మండల ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఎంపీఎస్ఓ), డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్‌లో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్ఓ) పోస్టులు ఉన్నాయి. అక్టోబర్ 30 నుంచి ఈ పోస్టులకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుండగా, నవంబర్ 27 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.అర్హతలు, వయోపరిమితి, ఫీజు వివరాలు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన అర్హతలు, వయోపరిమితి, ఫీజు వివరాలను టీజీపీఎస్సీ స్పష్టంగా వెల్లడించింది. స్టాటిస్టిక్స్‌ను ప్రధాన సబ్జెక్టుగా చదివి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు మాత్రమే ఈ ఉద్యోగాలకు అర్హులు. వయోపరిమితి విషయానికొస్తే, 2026 జులై 1 నాటికి అభ్యర్థుల వయసు కనీసం 18 ఏళ్లు నిండి, 44 ఏళ్లకు మించకూడదు. అయితే,

ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు వంటి రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయి. దరఖాస్తు రుసుముగా ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.1000 చెల్లించాల్సి ఉండగా, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.500గా నిర్ణయించారు.ఆకర్షణీయమైన వేతనం.. కీలకమైన బాధ్యతలు ఈ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆకర్షణీయమైన వేతన స్కేలుతో పాటు సమాజంలో కీలక పాత్ర పోషించే అవకాశం లభిస్తుంది. కమిషన్ ప్రకటించిన ప్రకారం, ఉద్యోగంలో చేరిన వారికి నెలవారీ వేతనం రూ.36,750 నుంచి రూ.1,06,990 వరకు ఉంటుంది. ప్రభుత్వ పథకాల ప్రణాళిక, అమలులో ఈ పోస్టులది కీలక పాత్ర. మండల స్థాయిలో ప్రభుత్వానికి అవసరమైన గణాంకాలను సేకరించడం, వాటిని విశ్లేషించడం, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించడం వంటివి వీరి ప్రధాన బాధ్యతలుగా ఉంటాయి.పరీక్ష విధానం.. ముఖ్యమైన తేదీలు ఈ పోస్టుల భర్తీకి సంబంధించి రాత పరీక్షను జనవరి నెలలో నిర్వహించేందుకు కమిషన్ సన్నాహాలు చేస్తోంది. పరీక్షకు వారం రోజుల ముందుగా అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అక్టోబర్ 30న దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానున్నందున, ఆసక్తిగల అభ్యర్థులు చివరి తేదీ అయిన నవంబర్ 27 వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని కమిషన్ సూచించింది. జోన్ల వారీగా ఖాళీలు, సిలబస్, పరీక్ష విధానం వంటి పూర్తి వివరాల కోసం అధికారిక నోటిఫికేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు. ఏవైనా మార్పులు ఉంటే, వాటిని కమిషన్ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే వెల్లడిస్తుంది.

హైదరాబాద్‌లో కమ్ముకుంటున్న చిమ్మచీకట్లు – ఈ నగరానికి ఏమైంది?

హైదరాబాద్ : కాలనీలు, ముఖ్యమైన? రహదారులు అనే తేడా లేకుండా హైదరాబాద్?లో పలు ప్రాంతాల్లో చిమ్మచీకట్లు నెలకొంటున్నాయి. క్యూర్ (కోర్? అర్బన్ రీజియన్) పరిధిలోని 3 మున్సిపల్ కార్పొరేషన్లలో వీధిలైట్ల నిర్వహణకు సంబంధించిన టెండర్?ను ఆమోదించకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వం, దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని మూడు కార్పొరేషన్ల మున్సిపల్ కమిషనర్లే ఈ సమస్యకు ప్రధాన కారణంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనివల్ల రోడ్డు ప్రమాదాలు, గంజాయి బ్యాచ్?ల ఆగడాలు, చోరీలు, దారి దోపిడీలు, ఆకతాయిల వేధింపులు వెలుగు చూస్తున్న సమస్యపై ‘ఈనాడు-ఈటీవీ భారత్?’ క్షేత్రస్థాయి పరిశీలన కథనం.రెండేళ్లుగా అంధకారమే హైదరా బాద్ నగరంలో 29 మే 2017 నుంచి ఏప్రిల్ 2024 వరకు కాంట్రాక్టులో భాగంగా ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ వీధిలైట్ల నిర్వహణను చూసింది. టెండర్ గడువు పూర్తయ్యాక మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో సర్కిళ్ల వారీగా కాంట్రాక్టర్లను నియమించుకుని అధికారులు నిర్వహణ పనులను పర్యవేక్షిస్తున్నారు. మూడు కార్పొరేషన్ల ఏర్పాటు సమయంలో ఎలక్ట్రికల్ ఇంజినీర్లను జీహెచ్ఎంసీ తిరిగి వారి మాతృ సంస్థకు పంపింది. సివిల్ ఇంజినీర్లకు అదనపు బాధ్యతగా వీధి లైట్ల నిర్వహణను అప్పగించడంతో వారు వాటిని పూర్తిగా పట్టించుకోవడం మానేశారు. నిర్వహణ చూడటానికి అవసరమైన పరికరాల



కొనుగోలు చేయడం కూడా నిలిచిపోయింది. ఎందుకు కొనట్లేదని ఇంజినీర్లను వివరణ కోరితే, కొత్త నిర్వహణ ప్రాజెక్టు టెండరు ప్రక్రియ పూర్తయిందని చెబుతున్నారు.గంజాయి ముఠాలుసీతాఫల్‌మండి జంక్షన్? నుంచి ఇఫ్లూ(ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ) మీదుగా తార్నాక, ఓయూ రోడ్లపై ఒక్క లైటూ వెలగట్లేదు. అదే అదనుగా ఇక్కడ యువకులకు గంజాయి అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయని, తాగిన మత్తులో కొందరు రోడ్లపై వాహనాలు వెళుతున్న క్రమంలో నానా హంగామా చేస్తున్నారంటూ స్థానికులు తీవ్రంగా గగ్గోలు పెడుతున్నారు.బేగంపేట మారిగోల్డ్ హోటల్ నుంచి సత్యం సినిమా టాకీస్ వరకు, బేగంపేట ఫ్లైఓవర్? నుంచి సికింద్రాబాద్ వరకు ప్రధాన రహదారిపై ఏ మాత్రం లైట్లు వెలగట్లేదు. సుచిత్ర హైవేపై దిగి, కాలినడకన డెయిరీఫామ్ రోడ్డుకు వెళ్లే వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నడవాల్సి వస్తోంది. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి రోడ్డు అంధకారంగా మారింది.అశోక్‌నగర్, ముషీరాబాద్ ఎక్స్‌రోడ్డు జంక్షన్?, రాంనగర్ రహదారిలో ఆర్నెళ్లుగా లైట్లు వెలగట్లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి మాదాపూర్ వరకు పూర్తిగా చీకటిగా ఉంటోంది. ఆర్టీసీ క్రాస్? రోడ్డు స్టీలు వంతెన, జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45 స్టీలు బ్రిడ్జి, దుర్గం చెరువు బ్రిడ్జిపైనా చీకటిగానే ఉంటోంది. హిమాయత్‌నగర్-నారాయణగూడ, వైఎంసీఏ గ్రౌండ్-కోఠి, రాణిగంజ్-సికింద్రాబాద్, బషీర్‌బాగ్, బర్కత్‌పురా, చిలకగూడ ఎక్స్‌రోడ్డు నెలల తరబడి చీకటిమయంలోనే ఉన్నాయి.9 వేల ఫిర్యాదులుజీహెచ్?ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్? కార్పొరేషన్ల పరిధిలో వీధి దీపాలపై 9 వేల ఫిర్యాదులు పెండింగులో ఉండటం పరిస్థితికి అద్దం పడుతోంది. ప్రజావాణి ఎక్స్ ‘మైక్యూర్ మొబైల్ యాప్’లో వచ్చే వినతులను కూడా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కొన్ని ప్రాంతాల్లో టైమర్లు లేకపోవడంతో 24 గంటల పాటు లైట్లు వెలుగుతూనే ఉంటున్నాయి. మాన్యువల్‌గా లైట్లను వెలిగించాల్సిన ప్రాంతాలకు సంబంధింత లైన్‌మెన్లు వెళ్లడం లేదు.

రంగారెడ్డి జిల్లాలో విషాదం.. ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్.. యువకుడి మృతి

రంగారెడ్డి, అక్టోబర్ 29: నగరంలోని మహేశ్వరం పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. విప్రో కంపెనీ సమీపంలో ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కేసీ తండాకు చెందిన రాహుల్ (22) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో యువకుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న అతడి బంధువులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. అనంతరం మహేశ్వరం ఆర్టీసీ డిపో వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ ఘటనతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.సమాచారం అందుకున్న ఎస్సై ధనుంజయ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదంలో మృతి చెందిన రాహుల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. యువకుడి మృతిపై బంధువులు ఆందోళన వ్యక్తం చేయడంతో పోలీసులు జోక్యం చేసుకుని వారికి సర్దిచెప్పారు. దీంతో ఆందోళన సద్దుమణిగింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నల్లగొండ జిల్లాలో గన్ ఫైర్.. బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌పై కేసు

నల్లగొండ, అక్టోబర్ 29:
దసరా పండుగ సందర్భంగా శమీపూజ నిర్వహిస్తుండగా గాల్లోకి కాల్పులు జరిపిన ఘటన నల్లగొండ జిల్లాలో కలకలం రేపింది. నకిరేకల్ మండలం నెల్లిబండ గ్రామంలో బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ చింతల సోమయ్య మూడు రౌండ్ల పాటు గాల్లోకి కాల్పులు జరిపినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాల్పుల ఘటనపై గ్రామానికి చెందిన ఓ వ్యక్తి డీజీపీకి ఫిర్యాదు చేశారు. పండుగ సందర్భంగా శమీపూజ నిర్వహించే సమయంలో తుపాకీతో కాల్పులు జరిపినట్లు వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేపట్టారు.ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఆర్మ్స్ యాక్ట్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. కాల్పులకు ఉపయోగించిన రివాల్వర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా.. గతంలోనూ చింతల సోమయ్య గ్రామస్తులతో పాటు పలువురిని తుపాకీ చూపించి బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయని సమాచారం. ఈ ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలు, కాల్పుల ఘటనకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోటీ పరీక్షల్లో పేపర్ లీకేజీ అనేది గతం

హైదరాబాద్ :ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో పేపర్ లీకేజీలు లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్, మాజీ ఐఏఎస్ బుర్రా వెంకటేశం తెలిపారు. గ్రూప్-1, 2, 3, 4 ఉద్యోగాల్లో డిస్క్రిప్టివ్? ఉన్నవి తప్ప మిగతా అన్నీ పరీక్షలు కంప్యూటర్ ఆధారిత పరీక్షల (సీబీఆర్‌టీ) విధానంలో జరుగుతాయని వెల్లడించారు. ఈటీవీ భారత్? ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను ఆయన పంచుకున్నారు. ఫలితాల వెల్లడి వరకు సంస్కరణలు అమలు దేశంలోని వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లను అధ్యయనం చేసి క్వశ్చన్? పేపర్ తయారీ నుంచి ఫలితాల వెల్లడి వరకు సంస్కరణలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నోటిఫికేషన్ వెలువరించిన తరువాత అప్లై

చేసేందుకు నెలరోజుల గడువు ఇస్తు న్నామని, సన్నద్ధతకు మరో రెండునెలలు అవకా శం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకసారి పరీక్షల తేదీలు ప్రకటించిన తరువాత 25 రోజుల్లో పూర్తిచేసి, దరఖాస్తు గడువు ముగిసిన తరువాత మూడునెలల్లోగా ప్రక్రియ పూర్తిచేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు వెంకటేశం వివరించారు.దాదాపు 9 నెలల్లో పూర్తి చేస్తాంకేవలం ఒకే పరీక్ష పెట్టే విధానంలోనైతే నియా మ కాలు మూడునెలల్లో, ప్రిలిమ్స్-మెయిన్స్ విధానంలో ఆరునెలల్లో, వీటికీ తోడుగా ఇంటర్వ్యూ ఉంటే నియామకాల ప్రక్రియ దాదాపు తొమ్మిది నెలల్లో పూర్తవుతాయని చెప్పారు. ప్రస్తుతానికి డిగ్రీ లెక్చరర్ పోస్టులకు ఇంటర్వ్యూలు ఉన్నందున వీటిని మూడు స్టేజీలలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. వేర్వేరు విద్యార్హతలున్న పోస్టులకు వేర్వేరు ప్రకటనలు ఇచ్చి తద్వారా న్యాయ వివాదాల ప్రక్రియతో ఆలస్యమయ్యే అవకాశాలు తగ్గిస్తున్నట్లు స్పష్టం చేశారు.“పోటీ పరీక్షల్లో ఉద్యోగం సాధించాలని లక్షల మంది రాసినా అందులో కొందరికే ఉద్యోగాలు వస్తాయి. ఆయా పోటీపరీక్షల్లో ప్రతిభ చూపి ఉద్యోగాలు పొందలేకపోయిన టాప్-10 మెరిట్ అభ్యర్థులకు ప్రభుత్వ రంగ, ప్రైవేటు రంగ సంస్థలు తమ అవసరాల మేరకు వారి నుంచి ఎంపిక చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాం. వారికి కూడా ఉద్యోగులను రిక్రూట్‌మెంట్ చేసుకునేందుకు చాలా పెద్ద ప్రాసెస్ ఉంటుంది. చాలా ఖర్చుతో కూడుకుని ఉంటుంది” బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. ఒకేరోజున రెండు వేర్వేరు నియామక సంస్థల పోటీ పరీక్షలు ఉంటే ఆయా పరీక్షలు రాసే అభ్యర్థులకు ప్రత్యామ్నాయ తేదీల్లో పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఇప్పటికే ఏఈఈ పరీక్షలకు ఈ వెసులుబాటు ఇచ్చినట్లు గుర్తుచేశారు. రాతపరీక్ష ముగిసిన మూడు వారాల్లో ఫైనల్? రిజల్ట్? వెల్లడిస్తామని ఉద్యోగ ప్రకటన జారీ నుంచి ఫలితాల వెల్లడి వరకు రకరకాల సంస్కరణలు అమలు

Printed Published and Owned by Godishala Somaiah Published from H.No 15-76 (V&M)Medipally,(Dist) Medchal Malkajgiri - 500098. Printed at Sree Sesha Sai Enterprises,Plot no 19, IDA Balanagar, Hyderabad Editor: Godishala Somaiah,email: nhnews24@gmail.com ,ph : 9912580066 RNI APTEL/2012/45237